


టీడీఆర్ కుంభకోణంపై సీఐడీ విచారణ

రవి నాయుడి ఫిర్యాదుతో కదులుతున్న డొంక

- చంద్రబాబుకు నివేదించిన మంత్రి నారాయణ
- అవినీతి తీరుపై విస్మయం వ్యక్తం చేసిన సీఎం



తిరుపతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతిలో జరిగిన ట్రాన్స్‌ఫర్‌బుల్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్) బాండ్ల కుంభకోణం తీగ కదలబోతోంది.అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సోమవారం తిరుపతిలో, తణుకులో జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణం తీరును పురపాలక శాఖ మంత్రి నారాయణ నివేదించారు. ముఖ్యంగా తిరుపతిలో బాండ్ల జారీకి అనుసరించిన విధానంపై సీఎంతో పాటు అధికార వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేసినట్టు తెలిసింది. స్థల సేకరణను ఎకరాల్లో గుర్తించి, బాండ్ల జారీకి చదరపు గజాల్లో లెక్కించినట్టు గుర్తించారు. అగ్రికల్చర్, రెసిడెన్షియల్ పరిధిలోని స్థలాలను కూడా కమర్షియల్‌గా గుర్తించి, రిజిస్ట్రేషన్ విలువ పెంచేసి భారీగా లబ్ధి పొందారని అంచనాకు వచ్చినట్టు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 2019-24లో జారీ చేసిన టీడీఆర్ బాండ్లపై అంతర్గత విచారణతో పాటు, భారీఎత్తున కుంభకోణం జరిగినట్టు వెలుగులోకి వచ్చిన మున్సిపాల్టీలపై సీఐడీ విచారణకు మొగ్గుచూపే అవకాశం కనిపిస్తోంది.

● విజిలెన్స్ విచారణపై హర్షం

తిరుపతి మున్సిపల్ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించడం అభినందనీయమని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాల్సిన అధికారులు పాలకులకు తొత్తులుగా మారిపోయి ప్రజాధనాన్ని లూటీ చేస్తే తగిన పరిణామాలకు సిద్ధపడాల్సి ఉంటుందన్నారు. మంత్రి నారా లోకేశ్‌కు ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి మంత్రి నారాయణకు లేఖ రాయడం, ఆయన విజిలెన్స్ విచారణకు ఆదేశించడం హర్షించదగ్గ విషయమన్నారు. అవినీతిపరులైన అధికారులను విడిచిపెట్టేదిలేదని త్వరలోనే మరికొంతమంది అధికారులపై కూడా ఫిర్యాదులు చేయనున్నట్టు చెప్పారు.

వీరిపైనే గురి

వైసీపీ నేతలతో అంటకాగిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులపై తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు ఇటీవల ప్రజాదర్బార్‌లో మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన పురపాలక శాఖ మంత్రి నారాయణకు లేఖ రాయడంతో విజిలెన్స్ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. రెవెన్యూ మేనేజర్‌గా ఉన్న వీఎస్ చిట్టిబాబు, ఆర్వో కేఎల్ వర్మపై విజిలెన్స్ విచారణ చేపట్టి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రవి నాయుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సమయంలో వైసీపీకి చిట్టిబాబు కొమ్ముకాశారని, కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను ఇబ్బంది పెట్టడంతో పాటు, ప్రలోభాలకు గురిచేశారని ఫిర్యాదు చేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లోనూ వైసీపీ అభ్యర్థి భూమన అభినయ్‌కి ఓట్లు వేయాలని సిబ్బందిపై ఒత్తిడి తెచ్చారని లేఖలో పేర్కొన్నారు. ఇక ఆర్వో కేఎల్ వర్మ పుంగనూరు మున్సిపల్ కమిషనర్‌గా పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డికి అనుకూలంగా వ్యవహరించారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి అనుకూలంగా పనిచేశారని పేర్కొన్నారు. అదేవిధంగా కుప్పం స్థానిక ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా వెళ్లి అక్కడ కూడా పెద్దిరెడ్డి చెప్పినట్టు చేశారని ఆరోపించారు. ప్రస్తుతం కార్పొరేషన్ ఆర్వోగానూ అనేక అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. మరో ఫిర్యాదు లేఖలో టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, డీఈ విజయకుమార్‌రెడ్డి పేర్లను ప్రస్తావించారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల ఏర్పాటు, టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో బాలసుబ్రమణ్యం పాత్ర ఉందని, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డికి, మాజీ డిప్యూటీ మేయర్ అభినయ్‌కి అనుకూలంగా వ్యవహరించారని పేర్కొన్నారు.

యూపీలో అదృశ్యమైన స్వామీజీ శ్రీకాళహస్తిలో ప్రత్యక్షం



గురు సరా నందాజీ మహారాజ్

శ్రీకాళహస్తి, ఆగస్టు 12: ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గురు సరా నందాజీ మహారాజ్ స్వామి శ్రీకాళహస్తిలో ప్రత్యక్షమయ్యాడు. తిరుపతి జిల్లాలో ఆయన కదలికలు ఉన్నాయన్న అనుమానంతో పోలీసు యంత్రాంగం రెండురోజులుగా గాలింపు చేపట్టింది. శ్రీకాళహస్తి పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో సోమవారం ఆయన ఉన్నట్లు గుర్తించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గురు సరా నందాజీమహరాజ్‌స్వామి కొద్దిరోజుల క్రితం ఆయన ఆవాసం ఉండే ఆశ్రమం నుంచి అదృశ్యమయ్యాడు.అత్యంత ప్రముఖులతో సన్నిహిత సంబంధాలున్న ఆయన కోసం కొద్దిరోజులుగా వెతుకులాట జరిగింది. తిరుపతి జిల్లా పరిధిలో స్వామిజీ కదలికలు ఉన్నట్లు పోలీసుశాఖ అధికారులకు సమాచారం వచ్చింది. రెండురోజుల పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పలు పోలీసు ప్రత్యేక బృందాలతో పాటు ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సిబ్బంది గాలించారు. ఎట్టకేలకు శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసే నరేష్ అనే కానిస్టేబుల్ పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో స్వామిజీని గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. తిరుపతి నుంచి ప్రత్యేక బృందం శుకబ్రహ్మాశ్రమానికి చేరుకుని ఆయనను విమానాశ్రయానికి తరలించి అక్కడి నుంచి యూపీకి పంపారు.



రుయా అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

బీసీ హాస్టల్లో కలుషిత ఆహారం

14మంది విద్యార్థులకు అస్వస్థత

తిరుపతి(వైద్యం)/రేణిగుంట, ఆగస్టు 12 : రేణిగుంట బీసీ బాలుర వసతిగృహంలో కలుషిత ఆహారం తిని 14మంది విద్యార్థులు అస్వస్థత పాలయ్యారు. ఆదివారం రాత్రి హాస్టల్ భోజనంతో పాటు వెనుక ఓ ఇంట్లో జరిగిన గృహప్రవేశ ఫంక్షన్‌లో చేసిన మిక్చర్, మైసూర్‌పాక్‌ను విద్యార్థులకు అందజేశారు.తిన్న విద్యార్థుల్లో 15మందికి సోమవారం ఉదయం విరేచనాలు, వాంతులు కావడంతో తొలుత రేణిగుంట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.అనంతరం తిరుపతి రుయాస్పత్రికి పంపించగా అత్యవసర విభాగంలో చేర్చుకుని వైద్యం అందించారు. అనంతరం చిన్నపిల్లల వార్డుకు తరలించారు.ఒకటి రెండు రోజులు పరిశీలనలో ఉంచి విద్యార్థులు పూర్తిగా కోలుకున్న తరువాత డిశ్చార్జి చేస్తామని చిన్నపిల్లల వైద్య విభాగాధిపతి మనోహర్ తెలిపారు.డీఎంహెచ్‌వో శ్రీహరి రుయాస్పత్రికి చేరుకొని చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. అంతకుముందు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి చంద్రశేఖర్, సహాయ అధికారి జోత్స్న, డీఎంహెచ్‌వో శ్రీహరి,డీపీవో సుశీలాదేవి రేణిగుంట ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్లోని గదులు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు.డీఎంహెచ్‌వో శ్రీహరి మీడియాతో మాట్లాడుతూ హాస్టల్‌కు వెంటనే పర్మినెంట్ వార్డెన్‌ను నియమించాల్సిన అవసరం ఉందన్నారు.ఎంపీడీవో విష్ణు చిరంజీవి, డాక్టర్ చత్ర ప్రకాష్‌రెడ్డి, ఈవోపీఆర్డీ వెంకటరత్నప్రభ, ఎంఈవో రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలకు పరిష్కారం దిశగా....

- 16నుంచి రెవెన్యూ సదస్సులు
- జిల్లాలోని 1,107 గ్రామాల్లో నిర్వహణ
- వచ్చే నెల 30 వరకు అర్జీల స్వీకరణ
- జిల్లా నోడల్ అధికారిగా జేసీ
- సదస్సులకు ప్రత్యేక కమిటీ సభ్యులు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 12: తిరుపతి జిల్లాలో భూసమస్యల పరిష్కారానికి ఈ నెల 16నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు.గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములతో పాటు పలువురి భూములను వైసీపీ నేతలు కబ్జా చేయడం, రికార్డులు తారుమారు చేయడం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బాధితులందరూ ఒక్కొక్కరూ బయటపడుతున్నారు. తమ తమ భూముల సమస్యలపై ఫిర్యాదులందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో సమస్య తీవ్రతను గుర్తించిన చంద్రబాబు భూసమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో ముఖ్యంగా తిరుపతి రూరల్ , చంద్రగిరి, ఆర్‌సీపురం,తిరుపతి అర్బన్ , ఏర్పేడు, రేణిగుంట, తొట్టంబేడు, శ్రీకాళహస్తి మండలాల్లో గత ఐదేళ్లలో ఇలాంటి అక్రమాలు భారీఎత్తున జరిగాయి. బాధితులు పెద్దసంఖ్యలో ఉన్నారు. ఈ భూసమస్యల పరిష్కారానికి గ్రామ రెవెన్యూ సదస్సులు వేదికలు కానున్నాయి. వైసీపీ నేతల భూదందాలు రెవెన్యూ సదస్సుల్లో వెలుగులోకి రానున్నాయి. ఈ నెల 16 నుంచి వచ్చే నెల 30 వరకు ప్రతి గ్రామంలో జరిగే రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. గ్రామస్థాయి సదస్సుల నిర్వహణ పర్యవేక్షణకు జిల్లాలో నోడల్ అధికారిగా జాయింట్‌కలెక్టర్ శుభం బన్సల్‌ను నియమించారు. భూసమస్యల ఫిర్యాదులను 45రోజుల్లో పరిష్కరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. భూ కొలతల్లో తేడాలు, సర్వే నెంబర్‌లో మార్పులు, సరిహద్దు, భూవిస్తీర్ణంలో తేడాలు, రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు ఇచ్చిన రికార్డుల్లో నమోదయిన తప్పులు, భూకబ్జాలు, భూఆక్రమణలు, అసైన్డ్, చుక్కల భూములు తదితర అంశాలపై బాధితుల నుంచి అధికారులు పిటీషన్లు స్వీకరించనున్నారు. అలాగే మ్యుటేషన్, భూవివాదాలు, 22(ఏ)జాబితాలపై ఫిర్యాదులను స్వీకరిస్తారు. ప్రతి ఫిర్యాదునూ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. జిల్లాలోని 774 గ్రామ పంచాయతీల్లోని 1,107 రెవెన్యూ గ్రామాల్లో తహసీల్దారు, ఆర్ఐ సమక్షంలో సదస్సులు జరగనున్నాయి. ఇక్కడ సమస్యలను ఆయా రెవెన్యూ డివిజనల్ అధికారులు సమీక్షిస్తారు. అనంతరం పరిశీలన నివేదికలను జిల్లాస్థాయికి పంపుతారు. జిల్లాస్థాయిలో జేసీ, కలెక్టర్ సమీక్షించి పరిష్కార చర్యలు చేపడతారు. వీటి నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక టీములను నియమించారు.

15న ప్రారంభించనున్న మంత్రి ఆనం

తిరుపతి జిల్లాలో ఈ నెల 15న రాష్ట్ర దేవదాయశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి లాంఛనంగా సదస్సులను ప్రారంభించనున్నారు.రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ఏడుగురు కమిటీ సభ్యులను కలెక్టర్ వెంకటేశ్వర్ నియమించారు. తహసీల్దారు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారి, మండల సర్వేయర్, దేవదాయ ధర్మాదాయశాఖ, వక్ఫ్‌బోర్డు ప్రతినిధులు, రిజిస్ట్రేషన్ శాఖ ప్రతినిధులు, అటవీశాఖ ప్రతినిధి రెవెన్యూ సదస్సు నిర్వహణ బృందాల్లో సభ్యులుగా ఉంటారు.

షార్ వేదికగా నేడు అంతరిక్ష దినోత్సవాలు

● హాజరు కానున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

సూళ్లూరుపేట, ఆగస్టు 12: ఈనెల 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు భారత ప్రభుత్వం, ఇస్రో, షార్ సంయుక్త ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని ఒఆర్ కురుప్ ఆడిటోరియంలో అంతరిక్ష దినోత్సవాలను నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ వేడుకలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ వేడుకల్లో పాల్గొంటారు.తరువాత షార్‌లోని మిషన్ కంట్రోల్ సెంటర్‌తో పాటు రాకెట్ ప్రయోగ వేదికలను, స్పేస్ మ్యూజియాన్ని పవన్ కల్యాణ్ సందర్శించనున్నారు.

ఎస్ఎస్ఎల్వీ-డీ 3 ప్రయోగం ఒకరోజు వాయిదా

సూళ్లూరుపేట, ఆగస్టు 12 : శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్ నుంచి ఈవోఎస్-08 ఉపగ్రహ ప్రయోగం ఒక రోజు వాయిదా పడింది.ఈ నెల 16న ఎస్ఎస్ఎల్వీ-డీ 3 రాకెట్ ద్వారా ఈవోఎస్-08 భూ పరిశీలన ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు.ఇస్రో అధికారులు తొలుత ఈ ప్రయోగాన్ని ఆగస్టు 15న ప్రయోగించేందుకు ఏర్పాట్లు చేశారు. షార్‌లో ఆగస్టు 13న అంతరిక్ష దినోత్సవాలు, 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉండడంతో ప్రయోగాన్ని ఒకరోజు వాయిదా వేసినట్లు ఇస్రో వర్గాల సమాచారం. ఆగస్టు 16న ఉదయం 9.17 గంటలకు షార్ నుంచి ఇస్రో రూపొందించిన మూడో స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ ఎస్ఎస్ఎల్వీ-డీ 3 ప్రయోగం చేపట్టనున్నారు. రాకెట్ అనుసంధాన పనులను శాస్త్రవేత్తలు పూర్తి చేసి ప్రయోగానికి సిద్ధం చేశారు. ఉపగ్రహం చుట్టూ ఉష్ణకవచం అమర్చి తుది పరీక్షలను పూర్తిచేశారు. ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ మంగళవారం షార్‌లో ప్రయోగంపై శాస్త్రవేత్తలతో సమావేశం కానున్నట్లు తెలిసింది.

ఒక్కడిగా వస్తే రూ.40వేలు

అసోసియేషన్ ద్వారా వస్తే రూ.23వేలే

మెడికల్ ల్యాబ్‌ల అనుమతికి పైసా వసూల్‌కు తెరలేపిన డీఎంహెచ్‌వో కార్యాలయం

రూ 40లక్షల వరకు దోపిడీ?

తిరుపతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా ల్యాబులు పెట్టి నాసిరకం వైద్య పరీక్షలు చేస్తూ, ప్రజల రక్తాన్ని పీల్చుతున్న కొన్ని ప్రైవేట్ ల్యాబ్‌ల దందాపై మీడియాలో వచ్చిన వార్తలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి కాసుల వర్షం కురిపిస్తోంది. 'ప్రైవేట్ ల్యాబుల దందా' శీర్షికన ఇటీవల పత్రికల్లో వచ్చిన కథనాలపై కలెక్టర్ స్పందించారు. చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. దీంతో గత వారంలో 26 ల్యాబ్‌లను సీజ్ చేయగా 87 ల్యాబ్‌లకు డీఎంహెచ్‌వో నోటీసులు అందించినట్టు తెలిసింది.తర్వాతే అసలు కథ మొదలైంది. సీజ్‌కు గురైన వారు, నోటీసులు అందుకున్నవారు డీఎంహెచ్‌వో కార్యాలయానికి క్యూ కట్టడం మొదలుపెట్టారు. వారి అవసరాన్ని క్యాష్ చేసుకునేందుకు డీఎంహెచ్‌వో కార్యాలయం పక్కా పథక రచన చేసింది. ల్యాబ్ రిజిస్ట్రేషన్లు చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజు రూ2,500 చెల్లించి, డాక్యుమెంట్లు అందజేస్తే లైసెన్స్ ఇవ్వాల్సిన బాధ్యత డీఎంహెచ్‌వోపై ఉంది. అలా జరగకుండా రిజిస్ట్రేషన్ సమయంలోనే రూ2,500 తోపాటు అదనంగా ఆఫీసు ఖర్చులకోసమని మరో రూ2,500 వసూలు చేసినట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ప్రకియ ముగిసి ఫైల్ సిద్ధమైన తర్వాత అసలు విషయం బయటపెడుతున్నారు. ఒక్కడిగా వస్తే రూ.40 వేలు ఇవ్వాలని, అదే అసోసియేషన్ తరఫున వస్తే రూ.23వేలు సరిపోతుందని డిమాండు చేస్తున్నట్టు బాధితులు చెబుతున్నారు. రూ.23వేలలో 20వేలు ఉన్నతాధికారి పేరు చెబుతుండగా మిగిలిన రూ.3వేలు డీఎంహెచ్‌వోలో అంతా తానై వ్యవహరించే ఓ ఉద్యోగి పేరు బయటకు వస్తోంది. అయినా ఇప్పుడిచ్చేది 3 నెలల తాత్కాలిక లైసెన్స్ మాత్రమేనని, తర్వాత పూర్తిస్థాయి లైసెన్స్ కోసం మరెంత సమర్పించుకోవాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా అధికారికంగా 200 వరకు ల్యాబ్‌లుండగా అనధికారంగా మరో 250 వరకు ఉన్నట్టు తెలుస్తోంది. తిరుపతిలో వందకు పైగా అనధికార ల్యాబ్‌లున్నాయి. వీరంతా ఇప్పుడు అనుమతుల కోసం డీఎంహెచ్‌వో కార్యాలయ బాట పడుతున్నారు. అనేక అవినీతి ఆరోపణలకు కేంద్ర బిందువుగా నిలుస్తున్న డీఎంహెచ్‌వో కార్యాలయం ఈ మధ్యనే ఓ వివాదంలో రచ్చకెక్కింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వైద్య సిబ్బంది నియామకంలోనూ అనేక అవకతవకలు జరిగినట్టు ఆరోపణలున్నాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు కాక ముందే మరో అవినీతి వ్యవహారం వెలుగులోకి రావడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. అనధికారికంగా నిర్వహిస్తున్న ల్యాబ్ యజమానులతో సమావేశం నిర్వహించి, వారికి తగిన అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉంది. నిబంధనల మేరకు నడుచుకోవాలని హెచ్చరించి, ఆ మేరకు అనుమతులు మంజూరు చేయాల్సిన అధికారులు వచ్చినవరకు దండుకోవడంపై దృష్టిపెట్టడం విమర్శలకు తావిస్తోంది.

ఘనంగా పద్మావతి కళాశాల వ్యవస్థాపక దినోత్సవం



తెలుగు విభాగం రిటైర్డ్ హెడ్ ప్రేమావతి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నారాయణమ్మ, అధ్యాపకులు

తిరుపతి రూరల్, ఆగస్టు 12: శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఈ పర్వదినం జరుపుకోవడం ఆనవాయితీ. 73వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ టి.నారాయణమ్మ అధ్యక్షతన కళాశాల ప్రాంగణంలోని సరస్వతీదేవి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 1952 సంవత్సరం ఆగస్టు 11వ తేదీన అప్పటి టీటీడీ ఈవో అన్నారావు.. రాయలసీమలో మహిళలు చదువుకోవడానికి వీలుగా కళాశాలను స్థాపించడం జరిగిందని గుర్తు చేశారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థినులు దేశవిదేశాల్లో ఉన్నతస్థాయిలో స్థిరపడ్డారన్నారు. ప్రతిభ అవార్డులు, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ తదితర వాటిలో విద్యార్థినులు ముందున్నారన్నారు. కాలాన్ని ఎవరూ వృథా చేయొద్దని సూచించారు. కష్టపడి చదువుకుంటే ఉన్నతస్థాయికి చేరుకుంటారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత తెలుగు విభాగాధిపతి డాక్టర్ డీఎం ప్రేమావతి, స్టూడెంట్స్ కౌన్సిల్ ఇన్‌చార్జి డాక్టర్ బి.జ్యోతి, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మహదేవమ్మ, వార్డెన్ హేమలత, డాక్టర్ భద్రమణి, డాక్టర్ విద్యుల్లత, డాక్టర్ ఉమారాణి, డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ వసుధ, డాక్టర్ శిరీష, డాక్టర్ ఉమాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతో భేటీ



తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 12: వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి హేమాంబరధరరావు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చించారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

పాకాల, ఆగస్టు 12: ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. గ్రామ పంచాయతీ పరిపాలన, నిధుల సద్వినియోగంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో ప్రభాకర్, ఎంపీపీ లోకనాథం, జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, ఈవోపీ ఆర్డీ మాలతి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



పాకాల, ఆగస్టు 12: పెద్దగోర్పాడు పంచాయతీలో ఉన్న తెలుగుతల్లి వృద్ధాశ్రమంలో సోమవారం మధ్యాహ్నం చంద్రగిరి నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కె.సావిత్రి అన్నదానం చేశారు. జన్మదినం పురస్కరించుకొని ఆశ్రమంలోని వృద్ధులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు.

కుష్టు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

భాకరాపేట, ఆగస్టు 12: కుష్టువ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా డిప్యూటీ డెమో అధికారి కిరణ్ కుమార్ అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డ ఉన్నతపాఠశాల విద్యార్థులు, సాయిబులపల్లె గ్రామ సమాఖ్య సభ్యులకు సోమవారం కుష్టు వ్యాధి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

1నుంచి ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలు

చంద్రగిరి, ఆగస్టు 12: విశాఖలో వచ్చేనెల ఒకటో తేదీ నుంచి మూడ్రోజుల పాటు ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలు జరగనున్నాయని చంద్రగిరి నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.శ్రీరాములు తెలిపారు. సోమవారం ఉదయం చంద్రగిరిలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. కోటిరెడ్డి రవి, రాజశేఖర్, రమేష్, తులసి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఏఐఎస్ఎఫ్ పతాకావిష్కరణ చేస్తున్న నాయకులు

చంద్రగిరి, ఆగస్టు 12: అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర కోశాధికారి సాయి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 3,4,5తరగతుల విలీన ప్రక్రియలో భాగంగా 4,500పాఠశాలలు మూతవేయడం జరిగిందన్నారు. ఉదయ్‌కుమార్, శ్రీరాములు, ఓంరాజ్, సాయి, సాంబ, చందు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



చంద్రగిరి, ఆగస్టు 12: పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై సి.మల్లవరం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బైక్‌పై వెళుతున్న వ్యక్తి వెనుక నుంచి కంటైనర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలంలో ఎలాంటి వ్యక్తిగత ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు.

ఆర్‌సీపురంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

రామచంద్రాపురం, ఆగస్టు 12: కమ్మకండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు త్రివర్ణ పతాకాన్ని చేబట్టి ఆర్సీపురం కూడలి వరకు సోమవారం ఉదయం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.తిరుమలరెడ్డి, జనార్ధన్‌చౌదరి, నరసింహారెడ్డి, జనార్దన్ నాయుడు, చిత్తూరు పార్లమెంటు బీజేపీ జిల్లా కార్యదర్శి కాయం హరినాథ్‌రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రభాకర్‌నాయుడు, ఓబీసీమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మునెయ్య, మండల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలొచ్చాయ్

కోట, ఆగస్టు 12 : మూడు నెలలుగా ఎదురుచూస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనాలు వచ్చాయి. సోమవారం రాత్రి నుంచే కూలీల బ్యాంక్ ఖాతాల్లో జూన్ 24వ తేదీ వరకు చేసిన పనులకు సంబంధించిన నగదు జమవుతోంది. ఉపాధి కూలీలకు వేతనాలు అందడం లేదంటూ ఇటీవల ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే.కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, గూడూరు, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో పనులు చేసిన కూలీలకు జూన్ 24వ తేదీ వరకు రావాల్సిన వేతనాలను కూలీల బ్యాంక్ ఖాతాలలో జమ చేసినట్లు డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వరప్రసాద్ తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఎర్రావారిపాలెం, ఆగస్టు 12: మండలంలోని డప్పు కళాకారుల నాయకులు సోమవారం తహసీల్దార్ పరమేశ్వర స్వామిని కలిసి సన్మానించారు. ఇటీవల బదిలీల్లో వచ్చిన ఆయన తహసీల్దార్ కార్యాలయానికి రాగా డప్పు కళాకారుల మండల అధ్యక్షుడు పాటూరి రెడ్డెప్ప రవి, సిద్ధరామయ్య తదితరులు కలిశారు. మండలంలోని రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

చంద్రగిరి

లైంగిక వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు

తిరుపతి(విద్య), ఆగస్టు 12: ఎయిడ్స్, లైంగిక వ్యాధుల నిర్మూలన, అవగాహన కార్యక్రమం 'మీకు తెలుసా'కు సంబంధించిన పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం కలెక్టరేట్‌లో సోమవారం జరిగింది. జిల్లా కుష్టు, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ హెచ్‌ఐవీ నియంత్రణ మండలి అధికారులు, జిల్లా చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం స్టాఫ్, పాస్, గ్రాసం తదితర స్వచ్ఛంద, సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు. జిల్లాలో రెండు నెలలపాటు మీకు తెలుసా పేరున అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

వ్యవసాయ అనుబంధ రంగాల్లో 'ఎస్వీ వెటర్నరీ'కి 33వ ర్యాంకు

వెటర్నరీ వర్సిటీల కేటగిరీల్లో 4వ స్థానం - ర్యాంకులను విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్



వెటర్నరీ వర్సిటీ పరిపాలనా భవనం

తిరుపతి రూరల్, ఆగస్టు 12: దేశంలోని వ్యవసాయ అనుబంధ రంగాల (అగ్రికల్చరల్ అండ్ అల్లైడ్ సెక్టార్స్) వర్సిటీలకు 2024 సంవత్సరానికి భారత ప్రభుత్వ నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ సంస్థ (ఎన్ఐఆర్ఎఫ్) సోమవారం ర్యాంకింగ్స్ విడుదల చేసింది. ఇందులో తిరుపతి కేంద్రంగా నడిచే ఎస్వీవెటర్నరీ వర్సిటీకి 33వ ర్యాంకు లభించింది. 74 వ్యవసాయ అనుబంధ రంగాల వర్సిటీలకు ఈ ర్యాంకులను ప్రకటించగా 46.41 స్కోరుతో 33వ ర్యాంకును కైవసం చేసుకుందని వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య తెలిపారు. వెటర్నరీ వర్సిటీల కేటగిరీల్లో దేశంలో 4వ స్థానంలో నిలిచిందన్నారు. గత ఏడాది వర్సిటీ 31వ స్థానంలో ఉండగా, ఈ ఏడాది 33కు పరిమితమైందన్నారు. వర్సిటీల కేటగిరీలో మాత్రం గత ఏడాదిలాగే ఈ సారి కూడా నాల్గవ స్థానాన్ని సాధించిందని వివరించారు. ఇన్‌చార్జి వీసీ జేవీ రమణ మాట్లాడుతూ.. బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో వర్సిటీ సాధించిన పురోగతికితోడుగా అధ్యాపకులు, ఉద్యోగుల సమన్వయంతో పనిచేయడం వల్ల ఉత్తమ స్థానాన్ని సాధించగలిగామన్నారు. ఇకపై కూడా సమష్టిగా పనిచేసి రానున్న ఏడాదిలో మెరుగైన స్థానాన్ని సాధించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఇప్పటికే దేశంలోనే న్యాక్ గుర్తింపు పొందిన తొలి వెటర్నరీ వర్సిటీగా గుర్తింపు ఉందన్నారు. కాగా, ర్యాంకింగ్స్‌పై వర్సిటీ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

తిరుపతిలో జోరు వర్షం







తిరుపతి అర్బన్, ఆగస్టు 12: తిరుపతిలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన జోరు వర్షం కురిసింది. పగలు ఎండ తీవ్రంగా ఉండి.. ప్రజలను ఉక్కపోతకు గురిచేసింది. సాయంత్రం ఆకాశం నీలి మేఘాలతో కప్పుకున్నా రాత్రి 8గంటల నుంచి తెరలు తెరలుగా జోరువాన కురిసింది. దాంతో రోడ్లపై ఉన్న ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తడిచి ముద్దయ్యారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. మరోవైపు వాతావరణం చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు.

అమ్మ పుట్టిన రోజే బిడ్డకు ఆఖరి రోజు!





చేతన్ (ఫైల్ ఫొటో) - నివాళి అర్పిస్తున్న బంధువులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 12: అమ్మ పుట్టిన రోజే బిడ్డకు ఆఖరి రోజు కావడంతో ఆ కుటుంబం జీర్ణించుకోలేక పోయింది. తమిళనాడు రాష్ట్రంలోని తిరవళ్లూరు జిల్లా కనకమ్మసత్రం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తిరుపతి మిలటరీ కాలనికి చెందిన జగ్గిశెట్టి చేతన్(22) అంత్యక్రియలు సోమవారం కుటుంబీకులు, బంధుమిత్రుల శోక సంద్రం మధ్య ముగిశాయి. చేతన్ తండ్రి జగ్గిశెట్టి నాగేంద్ర స్థానికంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. 20వ డివిజన్ టీడీపీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఈయనకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు లోకేష్ బుద్ధిమాంద్యం కలిగి ఇంటి వద్దనే ఉంటున్నాడు. దాంతో చేతన్‌ను బాగా చదివించాలని భావించాడు. టెన్త్ వరకు మోహన్‌బాబు కాలేజీలో చదివించాడు. తర్వాత బెంగళూరులో ఇంటర్, గుజరాత్‌లో బీఏ, ఎల్ఎల్‌బీ కోర్సు మూడేళ్లపాటు చదివాడు. అక్కడ కొన్ని ఇబ్బందులు తలెత్తడంతో చెన్నై పల్లవరంలోని వేల్స్ కాలేజీలో చేర్పించగా ఫైనలియర్ చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో తన తల్లి పుట్టిన రోజు కావడంతో తనతోపాటు చదువుకుని ప్రస్తుతం ఎస్ఆర్ఎం కళాశాలలో బీటెక్ చదువుతున్న మరో ఆరుగురితో కలసి దైవదర్శనం కోసం వెళ్లాడు. తొలుత తిరువణ్ణామలైలోని దక్షిణామూర్తిని ఆదివారం ఉదయం 9.30 గంటలకు దర్శనం చేసుకున్నాడు. తర్వాత కాణిపాకం వచ్చారు. మధ్యాహ్నం 1.30 గంటలకు స్వామిని దర్శించుకున్నాడు. తల్లికి ఫోన్‌చేసి శుభాకాంక్షలు చెప్పాడు. ఇంటికొచ్చేయమని తల్లిదండ్రులు ఎంతసేపు కోరినా.. చెన్నైకి వెళుతున్నామని, గిఫ్ట్ పంపిస్తానని చెప్పాడు. ఆ తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు పోగొట్టుకున్నాడు. 'అమ్మకు గిఫ్ట్ ఇస్తానని చెప్పి.. శవమై వచ్చావా?' అంటూ ఆ తల్లిదండ్రులు బోరున విలపించడం చూసిన వారందరినీ కంటతడి పెట్టించింది. చేతన్ మృతదేహాన్ని తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ నాయకులు సందర్శించి, పూలమాలలు వేసి, నివాళి అర్పించారు.

కోవనూరులోనూ విషాదఛాయలు



యోగేష్ (ఫైల్‌ఫొటో)

కేవీబీపురం: ఇదే రోడ్డు ప్రమాదంలో కేవీబీపురం మండలంలోని కోవనూరు గ్రామానికి చెందిన మాజీ వైఎస్ ఎంపీపీ కిరణ్ యాదవ్ కుమారుడు యోగేష్(21) కూడా మృతి చెందాడు. చెన్నై ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించాక మృతదేహాన్ని కోవనూరుకు సోమవారం సాయంత్రం తీసుకొచ్చారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గ్రామానికి చేరుకుని యోగేష్ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి, నివాళి లర్పించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని యోగేష్ తండ్రి కిరణ్‌యాదవ్‌కు, కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

అవినీతి ఆరోపణలను దమ్ముంటే నిరూపించాలి

చెవిరెడ్డికి సుబ్రహ్మణ్యం నాయుడి సవాల్



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చంద్రగిరి, ఆగస్టు 12: 'చంద్రగిరిలో భూకబ్జాలకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. దమ్ము, ధైర్యముంటే నిరూపించాలి' అని టీడీపీ మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రహ్మణ్యంనాయుడు సవాల్ విసిరారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఓ న్యూస్ ఛానల్లో నిర్వహించిన డిబేట్‌లో చెవిరెడ్డి అవినీతిపై వాస్తవాలు తెలిపిన తనపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అసత్య ఆరోపణలు చేయడం, ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టడం, వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం చెవిరెడ్డి నైజమని ఆగ్రహించారు. పదేళ్ల క్రితం బైక్‌పై తిరిగే చెవిరెడ్డికి రూ.5వేల కోట్లకు పైగా ఆస్తులు ఎలా వచ్చాయి, టీటీడీ పేరు పెట్టి దాతల నుంచి తుమ్మలగుంట దేవస్థానానికి తెచ్చిన నిధులు ఎంత, కోట్ల రూపాయలు విలువైన మఠం భూములు కబ్జాచేసింది ఎవరు, రూ.150కోట్లు తుడా నిధులతో తుమ్మలగుంట చెరువు కబ్జా చేసింది ఎవరని ప్రశ్నించారు. చెవిరెడ్డి అవినీతిపై సత్య ప్రమాణానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. తప్పుడు కథనాలను ప్రచురించే పత్రికపై న్యాయపోరాటం చేస్తానని హెచ్చరించారు. చెవిరెడ్డి అవినీతి చిట్టా మొత్తం త్వరలో బహిర్గతం చేస్తానని స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి, ధనంజయరెడ్డి, మేడసానికుమార్, నగరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలపై విచారణ జరిపించండి : టీడీపీ



ఎంపీడీవోకు వినతిపత్రమిస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి రూరల్, ఆగస్టు 12: 'తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లె గ్రామంలో చేపట్టిన ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు జరిగాయి. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలి' అని ఉప సర్పంచ్ చొక్కారెడ్డి జగదీశ్వర్‌రెడ్డి కోరారు. సోమవారం ఎంపీడీవో కరమేష్‌బాబుకు టీడీపీ నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ... వైసీపీ పాలనలో పనులు చేయకుండానే బిల్లులుపెట్టి నగదు డ్రా చేశారని, దీనిలో ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటాన్ని ప్రదర్శించారని ఆరోపించారు. గ్రామానికి చెందిన దివ్యాంగుడు హరిబాబురెడ్డి ఏ పని చేయకపోయినా ఆయన సతీమణితో కలిపి ఇద్దరిపైనా రూ.26,337 డ్రా చేసినట్లు ఆర్టీఐ ద్వారా సమాచారం సేకరించామని వివరించారు. 2021 మే 1 నుంచి 2022 మార్చి 31వ తేదీవరకు రూ.22 లక్షలకుపైగా డ్రా చేశారని, ఏయే పనులకు ఎంత వ్యయం చేశారు, ఎంతమంది కూలీలు పనిచేశారన్న విషయాలపై విచారించాలని కోరారు. టీడీపీ నాయకులు అత్తూరు చెంగారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, వెంకటరెడ్డి, కందాటి ప్రభాకర్‌రెడ్డి, రవిఆచారి తదితరులు పాల్గొన్నారు.





ఏనుగుకు ఆహారం పెడుతున్న విద్యార్థిని - పండ్లు, కూరగాయలతో విద్యార్థులు

జూపార్కులో ఏనుగుల దినోత్సవం

మంగళం, ఆగస్టు 12: ఎస్వీ జూపార్కులో సోమవారం ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏనుగుల జీవనశైలిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే జూపార్కులోని ఏనుగులకు వివిధ రకాల కూరగాయలు, పండ్లను ఆహారంగా అందించారు. క్యూరేటర్ సెల్వం అడవుల్లో ఏనుగుల ఆవశ్యకతను తెలియజేశారు. అసిస్టెంట్ క్యూరేటర్ చంద్రప్రసాద్, దీపక్, వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీలను రాజకీయంగా ఆదరించాలి



గూడూరు ప్రతినిధులకు స్వాగతం పలుకుతున్న జిల్లా నేతలు

తిరుపతి అర్బన్, ఆగస్టు 12: కూటమి గెలుపులో భాగస్వాములైన బీసీలకు ప్రభుత్వంలో రాజకీయంగా ఆదరించాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజగౌడ్ కోరారు. నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన సందర్భంగా గూడూరు నియోజకవర్గం బీసీ సంఘం అధ్యక్షుడు తల్లం ప్రసాద్ ఆధ్వర్యంలో తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. సోమవారం ఉదయం అలిపిరికి చేరుకున్న బృందానికి గరుడ సర్కిల్ వద్ద జిల్లా అధ్యక్షుడు స్వాగతం పలికారు. జిల్లా నాయకులు మధు, వెంకటేశ్, శ్రీకాంత్, సయ్యద్‌నౌషద్ తదితరులు పాల్గొన్నారు.

పని సర్దుబాటును నిలిపివేయాలి: ఫ్యాప్టో



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

తిరుపతి(విద్య), ఆగస్టు 12: ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను నిలిపివేయాలని ఉపాధ్యాయ సంఘం ఫ్యాప్టో కోరింది. ఈ మేరకు తిరుపతి అర్బన్ ఎంఈవో బాలాజీని సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. జీవో 117ను రద్దుచేసి, ఆంగ్ల మాధ్యమంతోపాటు సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలన్నారు. తర్వాత పదోన్నతులు కల్పించాకే సర్దుబాటు చేయాలన్నారు. నాయకులు మునికృష్ణమనాయుడు, రమేష్ నాయక్, వేణుగోపాల్, రేణుకదేవి, రమాదేవి, బండి మధుసూదన్‌రెడ్డి, నిర్మల, రెడ్డెప్పరెడ్డి, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

తిరుపతి(విద్య), ఆగస్టు 12: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు 'విశ్వం ఆవిర్భావం - అంతరిక్ష ప్రయోగాలు' అనే అంశంపై జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీలు నిర్వహించింది. సోమవారం జరిగిన ఈ పోటీలకు నగరంలోని ప్రముఖ కళాశాలల నుంచి 2,500 మంది విద్యార్థులు హాజరయ్యారని నగర కార్యదర్శి రఫీ వెల్లడించారు. విజేతలకు 15న జరిగే స్వాతంత్ర్య దిన వేడుకల్లో బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లతోపాటు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలను ఇవ్వనున్నట్టు తెలిపారు.

కారు దగ్ధంపై పోలీసులకు ఫిర్యాదు



దగ్ధమవుతున్న కారు

రామచంద్రాపురం, ఆగస్టు 12: ఓ కారు దగ్ధంపై రామచంద్రాపురం పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. ఎన్ఆర్ కమ్మపల్లెకు చెందిన శేఖర్ సోమవారం మహాభారత ఉత్సవాలకు జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించడానికి భారతంమిట్ట వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా తన కారును తిరుపతి-అనుపల్లె ప్రధాన రహదారిలో ఉన్న చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం వద్ద ఆపాడు. ఏర్పాట్లను పరిశీలించి తిరిగొచ్చేసరికి కారు పెద్ద మంటల్లో చిక్కుకుని ఉంది. వెంటనే తిరుపతి అగ్నిమాపక అధికారులకు ఫోన్లో సమాచారం అందించారు. వారు ఘటనాస్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనపై పోలీసులకు శేఖర్ ఫిర్యాదు చేశారు.

'సాగర్'లో నాట్య గణపతి విగ్రహం పెట్టాలి



మేయర్, కమిషనర్‌కి వినతిపత్రాలిచ్చిన కమిటీ సభ్యులు

తిరుపతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకుని వినాయక సాగర్లో జరిగే సామూహిక నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు చేయాలని కార్పొరేషన్ మేయర్ శిరీష, కమిషనర్ నారపరెడ్డి మౌర్యలను తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ కోరారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిటీ సభ్యులతో కలిసి మేయర్, కమిషనర్‌కి వినతిపత్రాలు అందజేశారు. నగరంలో దాదాపు 800లకుపైగా మండపాలు ఏర్పాటు చేస్తారని, అందుకు అనుగుణంగా వినాయక సాగర్లో ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ప్రధానంగా సాగర్ మధ్యలో భారీ నాట్య గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈనెలలో ఒక సమన్వయ సమావేశం పెట్టాలన్నారు. కమిటీ సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, మాంగాటి గోపాల్ రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, రుద్రకోటి సదాశివం, గుండాల గోపీనాథ్, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టరు హత్యకు కారకులను శిక్షించాలి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, విద్యార్థులు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 12: కోల్‌కతాలోని మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టరును హతమార్చిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ డిమాండ్ చేశారు. మృతిచెందిన జూనియర్ డాక్టరుకు సంఘీభావంగా రుయా, ప్రసూతి ఆస్పత్రుల వైద్యాధికారులు, వైద్య విద్యార్థులతో కలిసి సోమవారం సాయంత్రం రుయాస్పత్రి నుంచి రామకృష్ణ డీలక్స్ సర్కిల్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్విమ్స్ వైద్యులతో పాటు ఐఎంఏ నేతలు, పీజీ, యూజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా హర్ ఘర్ తిరంగా



ప్రమాణం చేస్తున్న డీఆర్వో, ఇతర అధికారులు

తిరుపతి(విద్య), ఆగస్టు 12: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో అధికారులు సోమవారం ఘనంగా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి కిషోర్ ఈ కార్యక్రమాన్ని జరిపించారు. కలెక్టరేట్‌లోని వివిధశాఖల అధికారులు జాతీయ జెండాలు చేతబట్టి దేశభక్తి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం హర్‌ఘర్ తిరంగా ఫ్లెక్సీపై సంతకాలు చేశారు. అలాగే హర్‌ఘర్ తిరంగా ఆన్‌లైన్ లింక్‌ద్వారా జాతీయ జెండాలతో సెల్ఫీలు తీసి, అప్‌లోడ్ చేశారు. ఈ కార్యక్రమంలో టూరిజం ప్రాంతీయ సంచాలకుడు రమణప్రసాద్, జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య పాల్గొన్నారు.

పొంచివున్న ప్రమాదం



తిరుపతి (జీవకోన), ఆగస్టు 12: తిరుపతి నగర పరిధిలోని 50వ డివిజన్ ఉపాధ్యాయ నగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో (నందనం అపార్ట్‌మెంట్ ఎదురుగా) పెద్ద కాలువ సైడ్ కాలువ రోజూ కురుస్తున్న వర్షాలకు కొంతభాగం కూలిపోయింది. మరికొంతభాగం కూడా కూలడానికి సిద్ధంగా ఉంది. సైడ్ వాల్ పడిపోవడంతో తారురోడ్డు కింద ఉన్న మట్టి కూడా వర్షాలకు కొట్టుకుపోతోంది. వర్షాలు ఏ మాత్రం అధికమైనా కూడా రోడ్డు కింది భాగంలో ఉన్న మట్టి కొట్టుకుపోయే పరిస్థితి ఉంటుంది. దీనివల్ల ఈ రోడ్డులో పెద్ద వాహనాలు వెళితే ప్రమాదం తప్పదు. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులుచేయాల్సిన అవసరం ఉంది.

అమూల్ పాల సేకరణను కొనసాగించండి

కలెక్టరేట్ ఎదుట పాడి రైతుల ప్రదర్శన



తిరుపతి(విద్య), ఆగస్టు 12: అమూల్ పాల సేకరణను కొనసాగించాలని పలు మండలాలకు చెందిన రైతులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం ప్రదర్శన నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ.. ప్రైవేటు పాల సేకరణదారులకంటే అమూల్ డెయిరీ తమకు లీటరుకు రూ.5 నుంచి రూ.10 అధికంగా చెల్లిస్తుందని చెప్పారు. ఈనెల 20వ తేదీ తర్వాత పాల సేకరణ నిలిపివేస్తున్నట్టు అమూల్ డెయిరీ నిర్వాహకులు చెబుతున్నార న్నారు. ఇలా చేస్తే ప్రధానంగా మహిళా పాడి రైతులు తీవ్ర ఇబ్బంది పడతారని చెప్పారు. పాల అమ్మకం ద్వారానే వారు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. అమూల్ పాలవెల్లువ మహిళా డెయిరీ సహకార సంఘం ఆధ్వర్యంలో 100 మంది మహిళలు ఉపాధి పొందుతున్నారని వెల్లడించారు. కలెక్టర్ ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమూల్ పాల సేకరణను కొనసాగించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

కోర్టుకు హాజరైన టీడీపీ నాయకులు



తిరుపతి లీగల్, ఆగస్టు 12: ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ నమోదైన ఓ కేసులో పది మంది టీడీపీ నాయకులు సోమవారం కోర్టుకు హాజరయ్యారు. 2019 మార్చి 20వ తేదీన తిరుపతిలోని కొర్లగుంట, సంజయ్‌గాంధీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా ఎన్నికల్ కోడ్ ఉల్లంఘించారని 10మందిపై అప్పటి ఈస్టు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు మొదటి వాయిదా విచారణకు కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్, అప్పటి టీడీపీ నాయకురాళ్లు డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి, డాక్టర్ రాయ ఆశాలతలతోపాటు నేతలు ఆర్సీ మునికృష్ణ, దంపూరి భాస్కర్ యాదవ్, సూరా సుధాకర్ రెడ్డి, పుష్పావతి, బీజీ కృష్ణ యాదవ్‌లు కోర్టుకు హాజరయ్యారు. వీరికి సంఘీభావంగా పార్టీ నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, శ్రీధర్ వర్మ, ఆముదాల తులసీరామ్, మునిశేఖర్ రాయల్, మునిరామయ్య, డాక్టర్ వెంకటేశ్వర్లు, మనోహ రాచారి, సుబ్రమణ్యం, పసుపులేటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రేషన్ డీలర్ల వ్యవస్థ నిర్వీర్యం



సమావేశమైన రేషన్ డీలర్లు

తిరుపతి అర్బన్, ఆగస్టు 12: వైసీపీ పాలనలో రేషన్ డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేశారని రేషన్ డీలర్ల జిల్లా కన్వీనర్ సి.హెచ్.వెంకటేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు స్నేహపూరితంగా వ్యవహరించి తమ ద్వారా బియ్యం పంపిణీకి అనుకూలంగా ఉన్నారని కొనియాడారు. రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న డీఆర్‌డీఏ ఫంక్షన్ హాల్లో బుధవారం ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం యూత్‌హాస్టల్లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, రాష్ట్ర సమాఖ్య అధ్యక్షులు దివి లీలామాధవరావు హాజరవుతారన్నారు.

పొరపాట్లకు తావుండకూడదు

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై జేసీ సమీక్ష



అధికారులకు సూచనలిస్తున్న జేసీ, డీఆర్వో

తిరుపతి(విద్య), ఆగస్టు 12: ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు చేయాలని జేసీ శుభం బన్సల్ ఆదేశించారు. ఈనెల 15న స్థానిక ఎంఆర్‌పల్లె పోలీస్ పరేడ్ మైదానంలో జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై డీఆర్వో పెంచల కిషోర్‌తో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. పూర్తి పర్యవేక్షణ బాధ్యత తిరుపతి ఆర్డీవో చూస్తారని చెప్పారు. పరేడ్ గ్రౌండ్ బందోబస్తు, జెండా వందనం, వేదిక అలంకరణ, కవాతు ఏర్పాట్లు పోలీసు, తుడా శాఖలు చేస్తాయని, సీటింగ్ ఏర్పాట్లను అర్బన్ తహసీల్దారు, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణను డీఈవో, ప్రథమ చికిత్స కేంద్రం, అత్యవసర వైద్యసేవల ఏర్పాట్లను డీఎంహెచ్‌వో చేయాలని సూచించారు. పారిశుధ్యం, తాగునీటి సదుపాయాలను మున్సిపల్ కమిషనర్, గ్రామీణ నీటి సరఫరాశాఖ చేయాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలపై 11 స్టాల్స్, ఏడు శకటాలను సంబంధిత శాఖలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో వివిధ శాఖలు సాధించిన ప్రగతి నివేదికను పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ను సమాచార శాఖాధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పార్కుల ఏర్పాటుకు ప్రణాళికలు : కమిషనర్

తిరుపతి (జీవకోన), ఆగస్టు 12: ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఆదేశించారు. సోమవారం తిమ్మినాయుడుపాళెం సమీపంలో నూతన పార్కు ఏర్పాటుకు అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. కాగా, తెల్లవారుజామున కమిషనర్ తనిఖీలు నిర్వహించారు. లీలామహల్ కూడలి వద్ద ఉన్న మాస్టర్ పాయింట్‌ను తనిఖీ చేసి ముఖ ఆధారిత హాజరును పరిశీలించి, సూచనలిచ్చారు. పాత కమిషనర్ బంగళా, పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను, ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా మంగళవారం నిర్వహించనున్న ర్యాలీ కోసం ఎస్వీయూ స్టేడియంలో జరుగుతున్న పనులను కూడా పరిశీలించారు. అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డీఈ విజయకుమార్‌రెడ్డి, హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేషరెడ్డి, డీసీపీ శ్రీనివాసులురెడ్డి, ఏసీపీ బాలసుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

లాడ్జీల్లో తనిఖీలు



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 12: ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో ఈస్ట్ సీఐ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు పోలీసులు బృందాలుగా విడిపోయి దాదాపు 50లాడ్జీలపై దాడులు చేశారు. ఎక్కడైనా జూదం, వ్యభిచారం, మద్యం తాగడం చేస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. ప్రతి లాడ్జి యజమాని తప్పనిసరిగా కస్టమర్ ఆధార్ కార్డు తీసుకోవాలని, వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు.

నిరుపేదలకు న్యాయం చేయండి

తిరుపతి అర్బన్, ఆగస్టు 12: డీకేటీ స్థలాల్లో నివాసముంటున్న నిరుపేదలకు న్యాయం చేకూరేలా ప్రత్యేక జీవో విడుదల చేయాలని, తద్వారా రిజిస్ట్రేషన్ అయ్యేలా చొరవ చూపాలని అఖిల భారత యాదవ యువజన మహాసభ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌యాదవ్ కోరారు. ఈమేరకు తిరుపతికొచ్చిన రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్‌కు సోమవారం విన్నవించారు. అలాగే మరోమంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి విద్యుత్ సమస్యలను విన్నవించారు. హరి, సురేష్, అవినాష్, యశ్వంత్, కమల్, హేమంత్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

17న జిల్లాకు ఉపరాష్ట్రపతి దంపతుల రాక

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 12: భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ దంపతులు ఈనెల 17వ తేదీన జిల్లాకు విచ్చేయనున్నట్లు అధికారులు తెలిపారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలో జరగనున్న 23వ వార్షిక స్వర్ణభారత్ ట్రస్టు ఉత్సవాల్లో పాల్గొననున్నారు. 17న ఉదయం 8.35గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక వాయుసేన విమానంలో బయల్దేరి తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. 9.50గంటలకు తిరుపతి విమానాశ్రయం నుంచి ప్రత్యేక వాయుసేన హెలికాప్టర్‌లో బయల్దేరి నెల్లూరులోని పోలీస్‌గ్రౌండ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన వెంకటాచలంలోని అక్షర విద్యాకేంద్రానికి వెళతారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శిస్తారు. ఉదయం 11.50గంటలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడితో కలిసి 23వ స్వర్ణభారత్ ట్రస్టు ఉత్సవాల్లో పాల్గొంటారు. భోజనానంతరం మధ్యాహ్నం మూడు గంటలకు నెల్లూరు పోలీస్ గ్రౌండ్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. 3.45గంటలకు ప్రత్యేక వాయుసేన విమానంలో తిరుపతి విమానాశ్రయం నుంచి ఢిల్లీ బయల్దేరి వెళతారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.89 కోట్లు

తిరుమల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.89 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 86,604 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 31,536 మంది తలనీలాలు సమర్పించారు.

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.51.09 లక్షల విరాళం



తిరుమల, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిర్వహణలోని ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు సోమవారం రూ.51.09 లక్షలు విరాళంగా అందాయి. హైదరాబాద్‌లోని పునర్నవ ఆయుర్వేద కంపెనీకి చెందిన బొమ్మ వెంకటేశ్వరరెడ్డి ఈ విరాళపు మొత్తాన్ని చెక్ రూపంలో తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యే హరీష్‌బాబు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

చోరీ కేసులో బాలుడికి ఏడాది జైలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 12: దొంగతనం కేసులో 17యేళ్ల బాలుడికి ఏడాది సాధారణ జైలు శిక్ష విధిస్తూ జువైనల్ జస్టిస్ బోర్డు తీర్పు చెప్పింది.చిత్తూరుకు చెందిన ఓ బాలుడు గత ఏడాది తిరుపతి రూరల్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంటిలో దొంగతనం చేసి దొరికిపోయాడు.కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. దాదాపు ఏడాదిపాటు సాగిన ఈ కేసులో దోషికి సంవత్సరంపాటు సాధారణజైలు విధిస్తూ తీర్పు చెప్పారు.

హథీరాంజీ మఠం ఇన్‌చార్జి ఏవోగా రామారావు



తిరుపతి అర్బన్, ఆగస్టు 12: హథీరాంజీ మఠం ఇన్‌చార్జి పరిపాలన అధికారి (ఏవో)గా ఈవో కె.ఎస్.రామారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఉన్న ఫిట్‌పర్సన్ రమేష్‌నాయుడిని ప్రభుత్వం మాతృసంస్థకు బదిలీ చేసింది. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ఈవోగా ఉన్న రామారావుకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా మఠం అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు. అనంతరం మొండి బకాయిల వసూళ్లపై ఇన్‌చార్జి ఏవో ఆదేశాలిచ్చారు. దాంతో ఏఈవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో కొన్ని దుకాణాల నుంచి వసూలు చేయగా, మిగిలిన వారికి హెచ్చరికలు జారీ చేశారు. మఠం సిబ్బంది మధుసూదన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, గంగాధరం, మణిభూషణ్‌రావు, శ్రీనివాసులు, రాము, నరసింహచార్యులు, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి-కాట్పాడి మధ్య ఆరు రోజులపాటు రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 12: తిరుపతి - కాట్పాడి మధ్య ఆరు రోజులపాటు ప్రత్యేక రైళ్లు (07659-07582) రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల కారణంగా ఈనెల 13, 20, 25, సెప్టెంబరు 1, 8, 16 తేదీల్లో మధ్య పలు రైళ్ల రాకపోకలు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుపతి-విల్లుపురం మధ్య నడుస్తున్న రెగ్యులర్ రైళ్లు(16853-16854)కూడా తిరుపతి- కాట్పాడి మధ్య పైన తెలిపిన తేదీల్లో రద్దు చేస్తున్నామన్నారు. అలాగే కాట్పాడి-జోలార్‌పేట మధ్య ప్రత్యేకరైళ్లు(06417- 06418) ను కూడా పైతేదీల్లో రద్దు చేస్తున్నట్లు వివరించారు. ప్రయాణికులు ఈ అసౌర్యాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

అత్యవసర వైద్యంపై అవగాహన

తిరుపతి(వైద్యం), ఆగస్టు 12: అత్యవసర వైద్యం అందించడంలో వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైద్య కళాశాలల్లో ఎంపిక చేయబడిన వైద్యులకు, సిబ్బందికి సోమవారం ఎస్వీ వైద్య కళాశాలలో జాతీయ అత్యవసర ప్రాణ రక్షణ నైపుణ్య శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యవసర విభాగంలోని రోగులకు ఎటువంటి వైద్యం అందించాలో అవగాహన కల్పించారు. రుయా, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు తరిగొండ వెంగమాంబ వర్ధంతి

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 12: శ్రీవారి పరమ భక్తురాలైన తరిగొండ వెంగమాంబ వర్ధంతి మంగళవారం నిర్వహించనున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. ఎంఆర్ పల్లె సర్కిల్‌లోని వెంగమాంబ విగ్రహానికి ఉదయం తొమ్మిది గంటలకు టీటీడీ అధికారులు పుష్పాంజలి సమర్పిస్తారు. అనంతరం శ్వేత భవనంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు సాహితీ సదస్సు జరుగుతుంది. సాయంత్రం ఆరు గంటలకు అన్నమాచార్య కళామందిరంలో భక్తి సంగీత కార్యక్రమం ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొంది.

ఏంటి మేడం మీరు కూడానా...?



కార్పొరేటర్ల డివిజన్లలోని సమస్యలపై కమిషనర్‌తో మాట్లాడుతున్న మేయర్ శిరీష

తిరుపతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కారవేదిక(పీజీఆర్ఎస్)లో సాధారణ ప్రజలకు అవకాశం ఇవ్వకుండా కార్పొరేటర్లు సమయాన్ని వృథా చేయడంపై విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో రెండు వారాలు మాత్రం కార్పొరేటర్లు దూరంగా ఉంటూ వచ్చారు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే సోమవారం మళ్లీ మొదటికి వచ్చారు. విమర్శలకు దూరంగా ఉండే మేయర్ డాక్టర్ శిరీష కూడా సహచర కార్పొరేటర్లను వెంటపెట్టుకుని కమిషనర్‌ను కలిశారు. వారి డివిజన్లలోని సమస్యలపై ఫిర్యాదు చేశారు. అదేవిధంగా మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు శాలిని, ఉమా అజయ్‌లు కూడా కమిషనర్‌ను కలసి తమ వార్డుల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందులో ముఖ్యంగా నగరంలోని రోడ్లలో ఉన్న గుంతలను పూడ్చాలని, పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా జరిపించాలని డిప్యూటీ మేయర్ కోరారు. వర్షాలకు తమ డివిజన్ జలమయం అవుతోందని పరిష్కరించాలని కార్పొరేటర్ ఉమా అజయ్ కోరారు. బైరాగిపట్టెడ ప్రాంతంలో అనేక సమస్యలు ఉన్నాయని, ఒకసారి పరిశీలించి పరిష్కరించాలని కార్పొరేటర్ శాలిని కోరారు. వీరివల్ల సాధారణ ప్రజలు గంటల తరబడి వేచివుండాల్సి వచ్చింది.

క్షేత్రస్థాయికి వెళ్లండి : కమిషనర్

పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. 62 మంది అర్జీలు అందజేశారన్నారు. శెట్టిపల్లె భూముల సమస్యపై అవగాహన చేసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చేపల మార్కెట్ దుకాణాల ధరలు తగ్గించాలని వ్యాపారస్తులు కోరగా, పెండింగ్ బిల్లులు చెల్లించాలని చెప్పారు. ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ మోహన్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఎంహెచ్‌వో యువ అన్వేష్ రెడ్డి, సెక్రటరీ రాధిక, డీఈలు విజయకుమార్ రెడ్డి, సంజయ్ కుమార్, నరేంద్ర, మహేష్, రాజు, శ్రావణి, ఆర్వోలు సేతు మాధవ్, కే.ఎల్.వర్మ, ఏసీపీ బాల సుబ్రమణ్యం, మేనేజర్ చిట్టిబాబు, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 164 అర్జీలు

తిరుపతి(విద్య), ఆగస్టు 12: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 164 అర్జీలు అందాయి. జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్‌తోపాటు డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, చంద్రశేఖర్, కోదండరామిరెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. 164 అర్జీల్లో రెవెన్యూ శాఖకు సంబంధించి అత్యధికంగా 110 ఉన్నాయి. ఇతర శాఖలకు సంబంధించి 54 అర్జీలు అందాయి.

ఎస్పీ కార్యాలయంలో 80 అర్జీలు

తిరుపతి(నేరవిభాగం): ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జనం నుంచి 80 అర్జీలు అందాయి. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళల సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, విమలకుమారి పాల్గొన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న అధికారులు

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి : ఎస్పీ



3కే రన్ ప్రారంభిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 12: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. జూపార్కు రోడ్డులో సోమవారం ఉదయం యువజన సర్వీసుల విభాగం ఆధ్వర్యంలో 3కే రన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ.. కళాశాలల్లో అనుమానాస్పదంగా బ్యాగులపై సమాచారాన్ని పోలీసు విభాగానికి అందించాలని కోరారు. ఇలా చెప్పినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సెట్విన్ సీఈవో మురళీకృష్ణ, డీఈవో శేఖర్ ప్రసంగించారు. 150మంది విద్యార్థులు పోటీపడగా, విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. సెట్విన్ మేనేజర్ మోహన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు చేయూత



తిరుపతి(నేర విభాగం), ఆగస్టు 12: విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు కుటుంబాలకు ఎస్పీ సుబ్బరాయుడు ఆర్థిక చేయూత అందించారు. ఇటీవల మరణించిన ట్రాఫిక్ ఎస్ఐ రెడ్డినాయక్ భార్య సరోజాకు రూ.1.50 లక్షలు, రిజర్వు కానిస్టేబుల్ అనిల్‌కుమర్ తల్లి సుశీలమ్మకు రూ.1.25 లక్షలు, హోంగార్డు మోహన్ భార్య కవితకు రూ.15,000 ఆర్థిక సాయం అందించారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసులు, మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలి



విద్యార్థులను పరామర్శిస్తున్న బీసీ విద్యార్థి విభాగం నేతలు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 12: 'రేణిగుంట బీసీ బాలుర వసతి గృహంలోని 14మంది విద్యార్థులు అతిసార బారిన పడటానికి కలుషిత ఆహారమే కారణం. ఇది వార్డెన్ నిర్లక్ష్యం కారణంగా జరిగింది. తక్షణమే ఆ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి' అని బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అతిసార బారిన పడి రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను సోమవారం సంఘం నేతలతో కలిసి పరామర్శించారు. జైభారత్ నేషనల్ పార్టీ రాయలసీమ బీసీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు భార్గవ్, నేతలు పవన్‌కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి పోటు కార్మికులకు రుణం మంజూరు



చెక్కును అందజేస్తున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 12: తిరుమల శ్రీవారి పోటు కార్మికులు ఐదుగురికి రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ తరఫున రూ.యాభై లక్షల రుణం మంజూరైంది. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఆరణి శ్రీనివాసులు చెక్కు అందజేశారు. బ్రాహ్మణ సొసైటీ గవర్నింగ్ బాడీ సభ్యులు, చిత్రపు హనుమంతరావు, కె.రామరత్నం, పి.కృష్ణ, ఆర్.రమేష్, టి.సతీష్, జి.వరదరాజులు, సీనియర్ అసిస్టెంట్ పీఆర్ఎల్ కుమార్, లీలావతి, భాగవతుల జయలక్ష్మి, వై.వెంకటేశ్వర్లు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టీటీడీకి రూ.4.10 లక్షల ఎరువుల వితరణ



ఎరువులను అందజేస్తున్న కోరమండల్ సంస్థ ప్రతినిధులు

తిరుమల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉద్యానవన విభాగానికి కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ రూ.4.10 లక్షల విలువైన ఎరువును సోమవారం విరాళంగా ఇచ్చింది. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, ఆర్ఎం రమణారెడ్డి, మార్కెటింగ్ ఆఫీసర్ మురళి తిరుమలలోని కల్యాణవేదిక వద్ద ఉన్న ఉద్యానవనం విభాగ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులకు ఎరువులను అందజేశారు. తిరుమల, తిరుపతిలో ఉద్యానవనాల్లో మొక్కల పెంపకానికి వీటిని వినియోగించనున్నారు. సంస్థ ప్రతినిధులు మధు, అనిల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు 14న ఇంటర్వ్యూలు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 12: స్విమ్స్‌లోని వైరాలజీ విభాగంలో ఐఎస్‌సీపీ-ఎన్‌సీడీసీ ప్రాజెక్టు కింద ఒకటి, ఐసీఎంఆర్-డీహెచ్ఆర్-వీఆర్‌డీఎల్ కింద మరోటి కలిపి రెండు తాత్కాలిక కాంట్రాక్టు లేబొరేటరీ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల వరకు పాత డైరెక్టర్ ఆఫీసులోని కమిటీ హాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు స్విమ్స్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

ఎస్పీతో ఎస్వీయూ రిజిస్ట్రార్ భేటీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 12: ఎస్పీ సుబ్బరాయుడిని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వర్సిటీలో ర్యాగింగ్ ఛాయలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీకి వివరించారు. ర్యాగింగ్, డ్రగ్స్‌తో నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎస్పీ ఈ సందర్భంగా సూచించారు.

భూకబ్జాల నుంచి తిరుపతి ప్రజలను కాపాడండి

మంత్రులను కోరిన కోడూరు బాలసుబ్రహ్మణ్యం

తిరుమల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూకబ్జాల నుంచి తిరుపతి ప్రజలను కాపాడాలని మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌ను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రహ్మణ్యం కోరారు. శ్రీవారి దర్శనార్థం సోమవారం తిరుమలకు వచ్చిన మంత్రులతో ఆయన మాట్లాడుతూ.. తిరుపతి, పరిసర ప్రాంతాల్లో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూ అక్రమాలను వివరించారు. ప్రజలను కాపాడటంతోపాటు ప్రభుత్వ భూములను కూడా పరిరక్షించాలని విన్నవించారు. అనగాని స్పందిస్తూ భూకబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థను తిరుపతిలోని అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసి స్మార్ట్ సిటీగా మరింత అభివృద్ధి చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు విన్నవించారు. ఫైబర్‌నెట్ అక్రమాలను కూడా వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

ఉపాధి కూలీలకు వేతనాలొచ్చాయ్

కోట, ఆగస్టు 12 : మూడు నెలలుగా ఎదురుచూస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనాలు వచ్చాయి. సోమవారం రాత్రి నుంచే కూలీల బ్యాంక్ ఖాతాల్లో జూన్ 24వ తేదీ వరకు చేసిన పనులకు సంబంధించిన నగదు జమవుతోంది.ఉపాధి కూలీలకు వేతనాలు అందడం లేదంటూ ఇటీవల ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే.కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, గూడూరు, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో పనులు చేసిన కూలీలకు జూన్ 24వ తేదీ వరకు రావాల్సిన వేతనాలను కూలీల బ్యాంక్ ఖాతాలలో జమ చేసినట్లు డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వరప్రసాద్ తెలిపారు.

పనులు కల్పించేలా చర్యలు తీసుకోండి


నిరసన తెలుపుతున్న మైకా కార్మికులు

గూడూరు, ఆగస్టు 12: తమకు పనులు కల్పించి జీవనోపాధి చూపాలని మైకా కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద మండలంలోని చెన్నూరు కు చెందిన మైకా కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గోగినేనిపురం, చెన్నూరు గ్రామాల్లో ఉండే మైకా కంపెనీల్లో పది సంవత్సరాలుగా రోజువారీ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మైనింగ్‌లో జరిగిన అవకతవకల కారణంగా రెండు నెలలుగా మైన్లను మూసివేశారన్నారు. మైన్ల నుంచి ముడిసరకు వస్తేనే తమకు పనులు ఉంటాయన్నారు. రెండు నెలలుగా పనులు లేకపోవడంతో కుటుంబపోషణ కష్టతరంగా మారిందన్నారు. అధికారులు స్పందించి పనులు కల్పించేలా మైనింగ్ పర్మిట్లు ఇప్పించాలన్నారు. అనంతరం తహసీల్దారు చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, భాస్కర్, కిరణ్, నాగరాజు, వెంకటేశ్వర్లు, మహిళా కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను అందుబాటులోకి తేవాలి


వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, ఆగస్టు 12: ఇసుకను అందుబాటులోకి తెచ్చి భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో తహసీల్దారు చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఇసుకను ఉచితంగా అందజేసి, భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలన్నారు. ఇసుక దళారీ వ్యవస్థను అరికట్టాలన్నారు. గూడూరు నియోజకవర్గంలో ఇసుక స్టాక్ పాయింట్ లేకపోవడంతో అధిక ధరలు వెచ్చించి ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. సమీప ఏటిలో నుంచి ఇసుకను తెచ్చుకోవాలన్నా పోలీసులు అడ్డుకుంటున్నారని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసి ఇసుకను అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. శివకుమార్, బీవీ.రమణయ్య, సురేష్, ప్రసాద్, శంకరయ్య, క్రిష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం


జెండాను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గూడూరు, ఆగస్టు 12: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యాగం చేసి ఉద్యమం నడిపిన ఏకైక విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ అని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శశికుమార్ అన్నారు. సోమవారం ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ 89వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన భగత్‌సింగ్ స్ఫూర్తిగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందన్నారు. దేశాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు ఏఐఎస్ఎఫ్ పోరాటాలు సాగిస్తుందన్నారు. విద్యారంగాన్ని కాపాడుకునేందుకు కలిసికట్టుగా పోరాడుదామన్నారు. ప్రమోద్, ప్రణయ్, సుమంత్, ముకేష్, హారిక తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న జనసేన నాయకులు

గూడూరు, ఆగస్టు 12: ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం లోని పలువురు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల అర్జీలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరతగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు కోట మండలంలోని సాగర్ గ్రంధి రొయ్యల కంపెనీ కాలుష్యం కారణంగా ఇబ్బంది పడుతున్నారని, నిబంధనలు పాటించని కంపెనీపై చర్యలు తీసుకుని ప్రజారోగ్యాన్ని కాపాడాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, గురుబాబు, వేణు, రవి నాగార్జున, సాయికిరణ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పలువురు సమస్యలపై అర్జీలు అందజేశారు.

బీసీలను రాజకీయంగా ఆదరించాలి



తిరుపతి అర్బన్, ఆగస్టు 12: కూటమి గెలుపులో భాగస్వాములైన బీసీలకు ప్రభుత్వంలో రాజకీయంగా ఆదరించాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజ గౌడ్ కోరారు. నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన సందర్భంగా గూడూరు నియోజకవర్గం బీసీ సంఘం అధ్యక్షుడు తల్లం ప్రసాద్ ఆధ్వర్యంలో తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. సోమవారం ఉదయం అలిపిరికి చేరుకున్న బృందానికి గరుడ సర్కిల్ వద్ద జిల్లా అధ్యక్షుడు స్వాగతం పలికారు. జిల్లా నాయకులు మధు, వెంకటేశ్, శ్రీకాంత్, సయ్యద్‌నౌషద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై దృష్టి సారించండి

గూడూరు అర్బన్, ఆగస్టు 12: గ్రామాల్లో మౌలిక వసతులు, పారిశుధ్యం మెరుగుపై సర్పంచులు ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీఎస్ఐఆర్‌డీ పరిశీలకురాలు రాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మహాత్మాగాంధీ, అంబేడ్కర్‌కు నివాళి అర్పించి సర్పంచులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. పంచాయతీల అభివృద్ధికి వచ్చే నిధులను సర్పంచులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీ కాలువలను అభివృద్ధి పరచడం, తాగునీటి సమస్యను పరిష్కరించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో వెంకటరమణ, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఏవో మురళి, ఎంపీపీ గురవయ్య, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా అన్న క్యాంటీన్

సూళ్లూరుపేట, ఆగస్టు 12: పేదల ఆకలి తీర్చేందుకు రూ.5కే భోజనం పెట్టేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తనువాత మళ్లీ అన్న క్యాంటీన్లను పునః ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్న విషయం విదితమే. ఈక్రమంలో మున్సిపాలిటీ అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. గాండ్లవీధిలోని సచివాలయం వద్ద అన్నక్యాంటీన్‌కు రంగులు వేసి భవన రూపురేఖలు మార్చి తాగునీరు సహా అన్ని వసతులు సమకూర్చి సిద్ధం చేశారు. ఆగస్టు 15న అన్న క్యాంటీన్‌ను పేదలకు అందుబాటులోకి తేనున్నారు.

ప్రధానోపాధ్యాయురాలిపై ఫిర్యాదు

వాకాడు, ఆగస్టు 11 : మండలంలోని కల్లూరు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సాయిప్రసూనపై సోమవారం గ్రామస్తులు ఎంఈవో నసీం అలీకి ఫిర్యాదు చేశారు. ప్రాథమిక పాఠశాలలో పది మంది విద్యార్థులుండగా, 18 మందిని చూపుతోందన్నారు. మిగతా 8 మంది ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నా వారికి అటెండెన్స్ వేస్తోంద న్నారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు పని చేసేం దుకు లేని విద్యార్థులను ఆన్‌లైన్‌లోనూ నమోదు చే స్తోందన్నారు. పాఠశాలలో ఇప్పటికే టీసీలు తీసుకుని ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పేర్లను తొలగించి ప్రధానోపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించని తహసీల్దార్!

- పేరుకుపోతున్న సమస్యలు
- సర్టిఫికెట్ల కోసం కాళ్లరిగేలా తిరుగుతున్న ప్రజలు



పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయం

పెళ్లకూరు, ఆగస్టు 11: తహసీల్దార్ కార్యాలయంలో 10 రోజులుగా రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో సమస్యలు పేరుకుపోతున్నాయి. భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు, కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాల కోసం విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయితే తహసీల్దార్ లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. తహసీల్దార్‌గా పనిచేసిన కేవీఆర్వీ ప్రసాదరావు సాధారణ బదిలీల్లో బాలయపల్లికి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. నెల్లూరు జిల్లా కలెక్టరేట్ నుంచి పెళ్లకూరు తహసీల్దార్‌గా అనురాధను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆమె వ్యక్తిగత కారణాలతో బాధ్యతలు చేపట్టలేదు. దీంతో గత శుక్రవారం నాయుడుపేట తహసీల్దార్ గీతావాణికి పెళ్లకూరు మండల తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే పెళ్లకూరు తహసీల్దార్ సిమ్‌కార్డుతో పాటు డిజిటల్ కీ ఆమెకు అప్పగించలేదని సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించి సమస్యలను త్వరిగతిన పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

డిప్యూటీ సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఆర్డీవో - పోలీసులకు దిశానిర్దేశం చేస్తున్న డీఎస్పీ

సూళ్లూరుపేట, ఆగస్టు 12: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ షార్ పర్యటనను ఎటువంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఆర్డీవో ఎం.కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ సీఎం షార్ పన్యటన నేపథ్యంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతరిక్ష దినోత్సవాలకు శ్రీహరికోటలోని షార్ కేంద్రానికి రానున్న పవన్ కల్యాణ్ పర్యటనను అధికారులందరూ కలిసి విజయవంతం చేయాలన్నారు. అనంతరం రాత్రి షార్‌కు చేరుకొని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌తో కూడా పర్యటనపై చర్చించారు. సూళ్లూరుపేట తహసీల్దార్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు..

డిప్యూటీ సీఎం పర్యటనకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లపై డీఎస్పీ జి.చెంచుబాబు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో సమీక్షించారు. తిరుపతి విమానాశ్రయం నుంచి డిప్యూటీ సీఎం ప్రత్యేక హెలికాప్టర్‌లో నేరుగా షార్‌కు చేరుకుంటారన్నారు. ఈ సందర్భంగా షార్‌లోని హెలిప్యాడ్ నుంచి పవన్ కల్యాన్ బస చేసే నక్షత్ర అతిథి భవనం వరకు, అదే విధంగా అంతరిక్ష దినోత్సవాలు జరిగే కురుప్ ఆడిటోరియంలో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 52 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. వీరిలో డీఎస్పీ, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలు, 45 మంది కానిస్టేబుళ్లు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట, నాయుడుపేట సీఐలు మురళీకృష్ణ, సంగమేశ్వర రావు, ఎస్ఐ రహీం రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామ పరిపాలనపై సర్పంచులకు శిక్షణ

ఓజిలి, ఆగస్టు 12 : గ్రామ పరిపాలన, పారిశుధ్యం వంటి ప్రధాన అంశాలపై ఓజిలి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ విస్తరణాధికారి మోహన్ అధ్వర్యంలో సర్పంచులకు శిక్షణ ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని 26 పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాలలో భాగంగా తొలిరోజు గ్రామ పరిపాలన, పారిశుధ్యంతోపాటు వీధిలైట్ల నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాలలో భాగంగా రెండో రోజు చెత్తనుంచి సంపద కేంద్రాల క్షేత్ర సందర్శనతోపాటు ఇతర పాలనా అంశాలు ఉంటాయన్నారు. చివరిరోజున ఇతర పరిపాలనా అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఈవోపీఆర్డీ మోహన్ తెలిపారు.● బాలాయపల్లి వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో సర్పంచులకు విధులు, బాధ్యతలు, పారిశుధ్య నిర్వహణ, చెత్తతో సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై ఎంపీడీవో అరుణ అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, ఏవో వినీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.● తడ: సర్పంచులకు మూడు రోజుల శిక్షణ తరగతులు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కొలవి రఘురెడ్డి, ఎంపీడీవో విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. 18 పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ● చిట్టమూరు: మండలంలోని సర్పంచులు, కార్యదర్శులకు సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి.● దొరవారిసత్రం: మండల పరిషత్ సమావేశ మందిరంలో 22 పంచాయతీల సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో శివరాజు ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ● డక్కిలి: పంచాయతీల అభివృద్ధికి సమష్టి కృషి అవసరమని ఎంపీపీ జి.రాజశేఖర్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్పంచుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంపై దృష్టి పెట్టాలన్నారు. రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం, కాలువుల్లో పూడిక తీత, వీధిలైట్లు వంటి వసతులు కల్పించాలని అందుకు అధికారులు సహకరించాలన్నారు. ప్రాధాన్యతా క్రమంలో నిధులను ఖర్చు చేయాలన్నారు. ఈవోపీఆర్డీ అల్లాబక్ష పాల్గొన్నారు.● నాయుడుపేట టౌన్: నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రారంభమైన సర్పంచుల శిక్షణ తరగతుల్లో డీఎల్‌పీవో రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. ● కోట: పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని విజయవాడకు చెందిన డీపీవో, పరిశీలకురాలు రాజ్యలక్ష్మి కోరారు.

బీసీ హాస్టల్ విద్యార్థులకు పరామర్శ



రేణిగుంట బీసీ బాలుర వసతిగృహంలో కలుషిత ఆహారం తిని అస్వస్థత పాలైన విద్యార్థులను ఆస్పత్రిలో పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీహరి-బీసీ హాస్టల్లో వార్డెన్‌ను వివరాలు అడుగుతున్న డీపీవో సుశీలాదేవి - రేణిగుంట

వ్యవసాయ అనుబంధ రంగాల్లో 'ఎస్వీ వెటర్నరీ'కి 33వ ర్యాంకు

- వెటర్నరీ వర్సిటీల కేటగిరీల్లో 4వ స్థానం
- ర్యాంకులను విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్


వెటర్నరీ వర్సిటీ పరిపాలనా భవనం

తిరుపతి రూరల్, ఆగస్టు 12: దేశంలోని వ్యవసాయ అనుబంధ రంగాల (అగ్రికల్చరల్ అండ్ అలైడ్ సెక్టార్స్) వర్సిటీలకు 2024 సంవత్సరానికి భారత ప్రభుత్వ నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ సంస్థ (ఎన్ఐఆర్ఎఫ్) సోమవారం ర్యాంకింగ్స్ విడుదల చేసింది. ఇందులో తిరుపతి కేంద్రంగా నడిచే ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి 33వ ర్యాంకు లభించింది. 74 వ్యవసాయ అనుబంధ రంగాల వర్సిటీలకు ఈ ర్యాంకులను ప్రకటించగా 46.41 స్కోరుతో 33వ ర్యాంకును కైవసం చేసుకుందని వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య తెలిపారు. వెటర్నరీ వర్సిటీల కేటగిరీల్లో దేశంలో 4వ స్థానంలో నిలిచిందన్నారు. గత ఏడాది వర్సిటీ 31వ స్థానంలో ఉండగా, ఈ ఏడాది 33కు పరిమితమైందన్నారు. వర్సిటీల కేటగిరీలో మాత్రం గత ఏడాదిలాగే ఈ సారి కూడా నాల్గవ స్థానాన్ని సాధించిందని వివరించారు. ఇన్‌చార్జి వీసీ జేవీ రమణ మాట్లాడుతూ.. బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో వర్సిటీ సాధించిన పురోగతికితోడుగా అధ్యాపకులు, ఉద్యోగుల సమన్వయంతో పనిచేయడం వల్ల ఉత్తమ స్థానాన్ని సాధించగలిగామన్నారు. ఇకపై కూడా సమష్టిగా పనిచేసి రానున్న ఏడాదిలో మెరుగైన స్థానాన్ని సాధించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఇప్పటికే దేశంలోనే న్యాక్ గుర్తింపు పొందిన తొలి వెటర్నరీ వర్సిటీగా గుర్తింపు ఉందన్నారు.

అన్నదానం


గూడూరు అర్బన్, ఆగస్టు 12: పట్టణంలోని గమళ్లపాళెంలో ఉన్న నిరాశ్రయుల కేంద్రంలో సోమవారం శ్రీకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ... తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి నెలా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మహేశ్వరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచ్చూరు... రొచ్చు...రొచ్చు!



దొరవారిసత్రం, ఆగస్టు 12: మండలంలోని ఉచ్చూరు గ్రామంలో ప్రధాన రోడ్డు రొచ్చురొచ్చుగా మారింది. గ్రామ నడిబొడ్డున ఉన్న రోడ్డు భారీ గోతులతో పాటు, వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్డులోని నీరు వెలుపలికి వెళ్లే దారి లేకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. గ్రామానికి ప్రధాన దారి కావడంతో అందరూ ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు 400 కుటుంబాలు నివసించే గ్రామం కావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత ఐదే ళ్ల వైసీపీ పాలనలో రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ పరి స్థితి దాపురించింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డుపై బురద నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ఉచ్చూరువాసులు కోరుతున్నారు.

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.51.09 లక్షల విరాళం



తిరుమల, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిర్వహణలోని ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు సోమవారం రూ.51.09 లక్షలు విరాళంగా అందాయి. హైదరాబాద్‌లోని పునర్జన్ ఆయుర్వేద కంపెనీకి చెందిన బొమ్మ వెంకటేశ్వరరెడ్డి ఈ విరాళపు మొత్తాన్ని చెక్ రూపంలో తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

చోరీ కేసులో బాలుడికి ఏడాది జైలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 12: దొంగతనం కేసులో 17యేళ్ల బాలుడికి ఏడాది సాధారణ జైలు శిక్ష విధిస్తూ జువైనల్ జస్టిస్ బోర్డు తీర్పు చెప్పింది.చిత్తూరుకు చెందిన ఓ బాలుడు గత ఏడాది తిరుపతి రూరల్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంటిలో దొంగతనం చేసి దొరికిపోయాడు.కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. దాదాపు ఏడాదిపాటు సాగిన ఈ కేసులో దోషికి సంవత్సరం పాటు సాధారణ జైలు విధిస్తూ తీర్పు చెప్పారు.

మొక్కు చెల్లించుకునేందుకు కూటమి నేతల తిరుమల పాదయాత్ర



వెంకటగిరి, ఆగస్టు 12: కూటమి ప్రభుత్వం ఏర్పడి ముఖ్యమంత్రిగా చంద్రబాబు, వెంకటగిరి ఎమ్మెల్యేగా కురుగొండ్ల రామకృష్ణ విజయం సాధిస్తే కాలినడకన తిరుమలకు వస్తామని ఎన్నికలకు ముందు మొక్కుకున్నామని దాన్ని చెల్లించేందుకు బయలు దేరామని డక్కిలి మండలం, వెంకటగిరి రూరల్ టీడీపీ అధ్యక్షులు పి.కోటేశ్వరరెడ్డి, పి.చంద్రమౌళిరెడ్డి చెప్పారు. వెంకటగిరి క్రాస్‌రోడ్డు సెంటర్ వద్ద ప్రారంభమైన యాత్రను తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాక్షస పాలన పోయి రామరాజ్యం రావాలని ఎన్నికలకు ముందు ఆ దేవదేవుడిని వేడుకున్నట్లు చెప్పారు. కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి కరుణాకటాక్షం వల్ల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం


చంద్రశేఖరపురంలో జరిగిన శిబిరం

కోట, ఆగస్టు 12: మండలంలోని గూడలి, చంద్రశేఖర పురంలలో సోమ వారం వీపీఆర్ ఫౌండేషన్, బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ, శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం జరిగింది. శిబిరాన్ని సర్పంచు ఆదెమ్మ, ఉప సర్పంచ్ విజయసారధిరెడ్డి ప్రారంభించారు. తిరుపతిలోని స్విమ్స్ వైద్యశాలకు చెందిన పలువురు వైద్యులు ఆయా శిబిరాల్లో గ్రామస్తులకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ దుర్గా సౌజన్య, డాక్టర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో రక్తం నమూనాలను సేకరించి తిరుపతికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మందులు పంపిణీ చేశారు. స్థానిక గునపాటిపాళెం వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు శిబిరాల్లో సాయం చేశారు.

పురందేశ్వరిని కలిసిన పురుషోత్తమరెడ్డి



వాకాడు, ఆగస్టు 11: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరిని గూడూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. గూడూరు నియోజక వర్గంలోని వాకాడు మండలం గంగన్న పాళెం వద్ద స్వర్ణముఖినదిపై వంతెన నిర్మాణం, తిరుమూరులో తెగిన రోడ్డు నిర్మాణం జరిగేలా కృషి చేయాలని కోరినట్టు పురుషోత్తమరెడ్డి చెప్పారు.

పొరపాట్లకు తావుండకూడదు

- స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

తిరుపతి(విద్య), ఆగస్టు 12: ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు చేయాలని జేసీ శుభం బన్సల్ ఆదేశించారు. ఈనెల 15న స్థానిక ఎంఆర్‌పల్లె పోలీస్ పరేడ్ మైదానంలో జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై డీఆర్వో పెంచల కిషోర్‌తో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. పూర్తి పర్యవేక్షణ బాధ్యత తిరుపతి ఆర్డీవో చూస్తారని చెప్పారు. పరేడ్ గ్రౌండ్ బందోబస్తు, జెండా వందనం, వేదిక అలంకరణ, కవాతు ఏర్పాట్లు పోలీసు, తుడా శాఖలు చేస్తాయని, సీటింగ్ ఏర్పాట్లను అర్బన్ తహసీల్దారు, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణను డీఈవో, ప్రథమ చికిత్స కేంద్రం, అత్యవసర వైద్యసేవల ఏర్పాట్లను డీఎంహెచ్‌వో చేయాలని సూచించారు. పారిశుధ్యం, తాగునీటి సదుపాయాలను మున్సిపల్ కమిషనర్, గ్రామీణ నీటి సరఫరాశాఖ చేయాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలపై 11 స్టాల్స్, ఏడు శకటాలను సంబంధిత శాఖలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో వివిధ శాఖలు సాధించన ప్రగతి నివేదికను పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ను సమాచార శాఖాధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన టీడీపీ నాయకులు

తిరుపతి లీగల్, ఆగస్టు 12: ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ నమోదైన ఓ కేసులో పది మంది టీడీపీ నాయకులు సోమవారం కోర్టుకు హాజరయ్యారు. 2019 మార్చి 20వ తేదీన తిరుపతిలోని కొర్లగుంట, సంజయ్‌గాంధీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా ఎన్నికల్ కోడ్ ఉల్లంఘించారని 10మందిపై అప్పటి ఈస్టు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు మొదటి వాయిదా విచారణకు కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్, అప్పటి టీడీపీ నాయకురాళ్లు డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి, డాక్టర్ రాయ ఆశాలతలతో పాటు నేతలు ఆర్సీ మునికృష్ణ, దంపూరి భాస్కర్ యాదవ్, సూరా సుధాకర్ రెడ్డి, పుష్పావతి, బీజీ కృష్ణ యాదవ్‌లు కోర్టుకు హాజరయ్యారు. వీరికి సంఘీభావంగా పార్టీ నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, శ్రీధర్ వర్మ, ఆముదాల తులసీరామ్, మునిశేఖర్ రాయల్, మునిరామయ్య, డాక్టర్ వెంకటేశ్వర్లు, మనోహరాచారి, సుబ్రమణ్యం, పసుపులేటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 164 అర్జీలు

తిరుపతి(విద్య), ఆగస్టు 12: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 164 అర్జీలు అందాయి. జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్‌తోపాటు డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, చంద్రశేఖర్, కోదండరామిరెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. 164 అర్జీల్లో రెవెన్యూ శాఖకు సంబంధించి అత్యధికంగా 110 ఉన్నాయి. ఇతర శాఖలకు సంబంధించి 54 అర్జీలు అందాయి.

తిరుపతి-కాట్పాడి మధ్య ఆరు రోజులపాటు రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 12: తిరుపతి - కాట్పాడి మధ్య ఆరు రోజులపాటు ప్రత్యేక రైళ్లు (07659-07582) రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల కారణంగా ఈనెల 13, 20, 25, సెప్టెంబరు 1, 8, 16 తేదీల్లో మధ్య పలు రైళ్ల రాకపోకలు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుపతి- విల్లుపురం మధ్య నడుస్తున్న రెగ్యులర్ రైళ్లు (16853-16854) కూడా తిరుపతి- కాట్పాడి మధ్య పైన తెలిపిన తేదీల్లో రద్దు చేస్తున్నామన్నారు. అలాగే కాట్పాడి- జోలార్‌పేట మధ్య ప్రత్యేక రైళ్ల(06417- 06418)ను కూడా పైతేదీల్లో రద్దు చేస్తున్నట్లు వివరించారు. ప్రయాణికులు ఈ అసౌర్యాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

తిరవళ్లూరు జిల్లాలో ప్రమాదం
కోవనూరు యువకుడి మృతి


యోగేష్ (ఫైల్‌ఫొటో)

కేవీబీపురం, ఆగస్టు 12: కేవీబీపురం మండలంలోని కోవనూరు గ్రామానికి చెందిన మాజీ వైఎస్ ఎంపీపీ కిరణ్‌యాదవ్ కుమారుడు యోగేష్(21) ఆదివారం రాత్రి తిరవళ్లూరు జిల్లా కనకమ్మసత్రం సమీపంలో కారు ప్రమాదానికి గురై మృతి చెందాడు. చెన్నై ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం యోగేష్ మృతదేహాన్ని కోవనూరుకు సోమవారం సాయంత్రం తీసుకువచ్చారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గ్రామానికి చేరుకుని యోగేష్ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని యోగేష్ తండ్రి కిరణ్‌యాదవ్ కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

బండిబాటకు పట్టా
వెబ్‌ల్యాండ్‌లో ఇష్టారాజ్యంగా మార్పులు
స్పందనలో ఫిర్యాదు చేసిన రైతు

ఏర్పేడు, ఆగస్టు 12: ఏర్పేడు మండలం సీతారాంపేట పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన మల్లెమ్మ పేరుతో 1975 రెండు ఎకరాల 63 సెంట్లు భూమికి అప్పటి ప్రభుత్వం పట్టా ఇచ్చింది. ఆ భూమితో పాటు పక్కనే సర్వే నంబరు 262/4లో ఉన్న 0.90 సెంట్లు, 264/3లో ఉన్న 0.13సెంట్లు స్థలాన్ని 36 ఏళ్లగా మల్లెమ్మ కుటుంబీకులు సాగుచేసుకుంటున్నారు. నాలుగేళ్ల క్రితం మల్లెమ్మ మృతి చెందడంతో ఆమె కుమారుడు చెంగల్‌రాయులు ఆ భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇదిలా ఉండగా 2022లో రెవెన్యూ అధికారుల సాయంతో ఓ వైసీపీ నేత మల్లెమ్మ కుటుంబీకులను ఆ భూమిని సాగు చేయనివ్వలేదు. సదరు భూమి గ్రామ కంఠం అని, అందులో ఎవరూ ప్రవేశించడానికి లేదని రెవెన్యూ అధికారులు కూడా అప్పట్లో అభ్యంతరం తెలిపారు. ఇటీవల వైసీపీ నేత తనకు పట్టా ఉందంటూ మల్లెమ్మ కుటుంబీకుల ఆధీనంలోని భూమిని ఆక్రమించుకున్నాడు. కాగా, 2008 రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆ భూమి వెబ్‌ల్యాండ్‌లో గ్రామకంఠంగా ఉంది. అదే భూమి 2022లో బండిబాటగా మారిపోయింది. ఇప్పటికీ రెవెన్యూ రికార్డుల ప్రకారం బండిబాటగా ఉన్న భూమికి 2002లోనే తనకు పట్టా ఇచ్చారని వైసీపీ నేత చెబుతుండడం గమనార్హం. దీనిపై చెంగల్‌రాయులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో అధికారులకు ఫిర్యాదు చేశాడు. 2002లో పనిచేసిన తహసీల్దారు ఫోర్జరీ సంతకంతో పట్టా, పాసు పుస్తకాలను తయారు చేయించుకున్న వైసీపీ నేత తమ కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించాడు.

రెండు లారీల ఢీ
ఆరు కిలోమీటర్లు స్తంభించిన ట్రాఫిక్


గుత్తివారిపల్లి వద్ద భారీగా స్తంభించిన ట్రాఫిక్

రేణిగుంట, ఆగస్టు 12: రెండు లారీలు ఢీకొనడంతో రేణిగుంట - శ్రీకాళహస్తి మార్గంలో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. రేణిగుంట నుంచి శ్రీకాళహస్తి వరకు హైవే పనులు జరుగు తుండటంతో ఈ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. సోమవారం ఉదయం గుత్తివారిపల్లి వద్ద ప్రధాన వంతెనపై వెళుతున్న రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించింది. రేణిగుంట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రయత్నించగా వాహనాలు ముందుకు, వెనక్కు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో పోలీసులు క్రేన్‌ను రప్పించి రెండు లారీలతో విడదీసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. ఇదే సమయంలో సుమారు ఆరు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించి పోవడంతో దాదాపు రెండు గంటల సేపు వాహనాల్లో ప్రయాణికులు నరక యాతన అనుభవించారు. వాహనాల్లో ఉన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బందులకు గురయ్యారు.

పుత్తూరు వార్తలు

తహసీల్దారుకు సన్మానం


తహసీల్దారును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు టౌన్, ఆగస్టు 12: పుత్తూరు తహసీల్దారు వెంకటేశ్వర్లును టీఎన్‌టీయూసీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు సన్మానించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారును కలిసిన నాయకులు శాలువ కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రవికుమార్, ఐటీడీపీ కోఆర్డినేటర్ ఈశ్వర్ యాదవ్, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, 19వ వార్డు అధ్యక్షుడు ఉమాశంకర్ రెడ్డి, నాయకులు కృష్ణమరాజు, మురళీ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

శేష వాహనంపై ద్రౌపదీదేవి

పుత్తూరు టౌన్, ఆగస్టు 12: పుత్తూరు పట్టణంలోని ద్రౌపదీ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు ఆదిశేష వాహనంపై ఊరేగారు. ఉదయం అమ్మవారికి అభిషేకం చేసి, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. పుత్తూరు హరిజన సంఘం ఆధ్వర్యంలో హిడింబాసురుడు, బకాసుర వధ ఘట్టాన్ని నిర్వహించారు. అనంతరం కర్ణం సంఘం ఆధ్వర్యంలో శేష వాహనంపై అమ్మవారు ఊరేగుతూ ప్రజలకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ సాళ్వాకం కృష్ణప్ప మెదలి, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఆర్.యుగందర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధిలో సర్పంచు, కార్యదర్శులే కీలకం



శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

పుత్తూరు టౌన్, ఆగస్టు 12: పంచాయతీల అభివృద్ధిలో సర్పంచు, కార్యదర్శులే కీలకమని ఎంపీడీవో ఇందిమర్మ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులకు, కార్యదర్శులకు ఎంపీపీ మునివేలమ్మ అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం జరిగింది. పంచాయతీ విధులు, బాధ్యతలు, పారిశుధ్యం వ్యర్థాల నిర్వహణ, చెత్త సేకరణ, వర్మీకం పోస్టు తయారీ, పంచాయతీ అభివృద్ధికి సంబంధించి ప్రణాళిక, ఆర్థిక వనరుల సమీకరణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులు, రిసోర్స్ పర్సన్ నరసింహులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

డీఎస్పీ వెంకటాద్రి బాధ్యతల స్వీకారం



రేణిగుంట, ఆగస్టు 12: రేణిగుంట డీఎస్పీగా వెంకటాద్రి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ భవ్య కిషోర్ బదిలీ కావడంతో తిరుపతి ఎస్‌బీ డీఎస్పీగా పనిచేస్తున్న విధులు నిర్వహిస్తున్న వెంకటాద్రి రేణిగుంట డీఎస్పీగా వచ్చారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



శ్రీకాళహస్తి, ఆగస్టు 12: శ్రీకాళహస్తి మండలం పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పంచాయతీల వారీగా స్థానిక సమస్యలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. సమస్యల పరిష్కారంపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో అభివృద్ధి ఊసే లేకుండా పోయిందన్నారు. గ్రామాల్లో మౌలిక సమస్యలు సైతం ఎక్కడికక్కడ తిష్టవేస్తున్నాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఫీఖాన్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జాతరలో బీభత్సంపై కేసుల నమోదు

శ్రీకాళహస్తి, ఆగస్టు 12: జాతరలో జరిగిన బీభత్సం ఘటనపై టూటౌన్ పోలీసులు సోమవారం రెండు కేసులు నమోదు చేశారు. ఆదివారం అర్ధరాత్రి పట్టణంలోని తెట్టు కూడలి వద్ద సున్నపు అరుంధతివాడ జాతర ముగింపు వేడుక జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలోని ముత్తరాశిపాళెం ప్రాంతానికి చెందిన శివారెడ్డి డప్పు వాయిద్యకారులను మద్యం మత్తులో దుర్భాషలాడాడు. ఈ క్రమంలో సర్దిచెప్పే ప్రయత్నం చేసిన నాగేంద్రబాబుపై శివారెడ్డి మరో ఇద్దరు మిత్రులతో కలిసి కత్తితో దాడి చేసి పరారయ్యాడు. దీంతో నాగేంద్రబాబు వర్గీయులు శివారెడ్డి కోసం గాలించగా దాడి సమయంలో అతని వెంట ఉన్న సాయికిరణ్ అనే యువకుడు పట్టుబడ్డాడు. అతనిపై కొందరు దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై ఆంధ్రజ్యోతిలో సోమవారం జాతరలో బీభత్సం అన్న శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై ఎస్పీ సుబ్బరాయుడు సీరియస్‌గా స్పందించారు. వెంటనే శివారెడ్డిని అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. దీంతో శివారెడ్డిని అరెస్టు చేసి నాగేంద్రబాబు ఫిర్యాదు మేరకు అట్రాసిటీ, హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అలాగే సాయికిరణ్ బంధువుల ఫిర్యాదు మేరకు దాడి కేసు నమోదు చేశారు.

శివారెడ్డి వరుస అరాచకాలు

ముత్తరాశిపాళెం ప్రాంతానికి చెందిన శివారెడ్డి సాగిస్తున్న వరుస అరాచకాలు పట్టణంలో చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల ముందు శివారెడ్డి వైసీపీ నుంచి టీడీపీలో చేరాడు. గతంలో ఇతనిపై పలు కేసులు ఉన్నాయి. గత రెండు నెలల కాలంలో ఇతడు వరుసగా చేసిన అరాచకాలు అందరినీ కలవరపెడుతున్నాయి. రెండు నెలల క్రితం ముత్తరాశిపాలెం ప్రాంతంలోని స్క్రాప్ దుకాణంలో నిర్వాహకురాలైన మహిళను ఇనుము కొనుగోలు చేసే సమయంలో దొంగ సరుకు కొంటున్నావంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. తనకు నగదు ఇవ్వాలంటూ వారిపై రెచ్చిపోయాడు. మహిళ మెడలోని బంగారు చైనును ఆమె భర్త సెల్‌ఫోన్, ఇనుము విక్రయించేందుకు వచ్చిన డ్రైవర్ సెల్‌ఫోన్ లాక్కుని అక్కడి నుంచి పరారయ్యాడు. ఆ తరువాత బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదైంది. అలాగే ముత్తరాశిపాళెంలో మద్యం మత్తులో రోడ్డుపై వీరంగం చేశాడు. అదే సమయంలో అటుగా ద్విచక్ర వాహనంపై వెళుతున్న డీఎస్పీ డ్రైవర్‌ను అడ్డగించి చెంప చెళ్లుమనిపించాడు. తాను పోలీసును అని చెబుతున్నా.. అవునురా తెలిసే కొడుతున్నా అంటూ మరోసారి ద్విచక్ర వాహనంపై రాయితో దాడి చేశాడు. ఈ ఘటనపై మరో కేసు నమోదైంది. పది రోజుల క్రితం ముత్తరాశిపాళెం వద్ద రోడ్డులో మద్యం మత్తులో కనిపించిన వారినంతా భూతులు తిడుతూ పైశాచికంగా ప్రవర్తించాడు. ఇదే తరహాలో తెట్టుకూడలి వద్ద కత్తితో హత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. సోమవారం శివారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. కొద్దిరోజుల క్రితమే ఆన్‌లైన్‌లో శివారెడ్డి బటన్ కత్తిని కొనుగోలు చేసి తన వద్ద ఉంచుకున్నట్లు వెల్లడించినట్లుగా తెలిసింది. డీఎస్పీ డ్రైవర్‌పై దాడి చేసిన రోజే కఠిన చర్యలు తీసుకుని ఉంటే ఆదివారం అర్ధరాత్రి హత్యాయత్నం జరిగేది కాదని, ఇప్పటికైనా పోలీసులు చర్యలు తీసుకుని శివారెడ్డి అరాచకాలకు అడ్డుకట్టవేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మత్తుతో జీవితం చిత్తు

ఏర్పేడు, ఆగస్టు 12: పాపానాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం రాష్ట్రీయ సేవాసమితి మత్తు పదార్థాలు, వ్యసనపరుల పునరవాస కేంద్రం సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల వాడకం, దుష్పరిణామాల గురించి పునరావాస కేంద్రం అధికారి అన్నాదురై విద్యార్థులకు వివరించారు. సర్పంచు లలితా కరుణాకర్ మాట్లాడుతూ చెడు అలావాట్లకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తుపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మునిరాజా, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వెంకటసుబ్బమ్మ, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, డాక్టర్ మాధురి, మెడికల్ ఆఫీసర్, రాస్ సిబ్బంది కవిత, కౌన్సిలర్ నాగరాజు, శబరీదేవి పాల్గొన్నారు.

గంగమ్మకు గ్రామోత్సవం

వరదయ్యపాళెం, ఆగస్టు 12: వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ పంచాయతీ పద్మావతిపురంలో సోమవారం గంగమ్మ గ్రామోత్సవం వైభవంగా జరిగింది. నాలుగు రోజులుగా జాతర జరుగుతోంది. ఇందులో భాగంగా సోమవారం అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

సహకార సంఘంలో రైతులు కేవైసీ చేసుకోండి

వరదయ్యపాళెం, ఆగస్టు 12: వ్యవసాయ సహకార సంఘంలో సభ్యత్వం కలిగిన రైతులు సహకార సంఘాల ఎన్నికల్లో తమ ఓటుహక్కును కొనసాగించుకోవడానికి కేవైసీ చేసుకోవాలని సహకార సంఘం ఇన్‌ఛార్జి అమరవేలు సూచించారు. కడూరు వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశం సీఈవో సంపత్ మాట్లాడుతూ సహకార సంఘంలో సభ్యత్వం, ఓటు హక్కు కలిగిన రైతులు తమ ఆధార్, పట్టాదారు పుస్తకం, బ్యాంకు పాస్ పుస్తకం నకలు అందించి ఈ నెల 30లోగా కేవైసీ చేసుకోవాలని కోరారు. అలాంటి వారికి మాత్రమే రానున్న సహకార సంఘం ఎన్నికల్లో ఓటుహక్కు ఉంటుందన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీని జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి, ఆగస్టు 12: శ్రీకాళహస్తి పట్టణంలో మంగళవారం జరిగే హర్ ఘర్ తిరంగా ర్యాలీని జయప్రదం చేయాలని బీజేపీ నాయకులు కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆధర్వ్యంలో మంగళవారం ఉదయం 9గంటలకు భేరివారి మండపం వద్ద జాతీయ జెండాలను చేతబట్టి బజారువీధి, తేరువీధి, నెహ్రూరోడ్, నగరి వీధుల్లో ర్యాలీ జరుగుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

మెనూ ప్రకారం భోజనం

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 12: స్థానిక బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెడుతున్నామని, ట్యూటర్స్‌ను ఏర్పాటు చేసి విద్యను బోధిస్తున్నామని వార్డెన్ రామయ్య తెలిపారు. సోమవారం హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వార్డెన్ రామయ్య మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులకు నూరు శాతం ఫలితాల లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా వారిని చదివిస్తున్నామన్నారు. 2023 -24 టెన్త్ ఫలితాల్లో హాస్టల్ విద్యార్థులు నూరుశాతం ఫలితాలను సాధించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

శేష వాహనంపై వీరభద్రుడు

నారాయణవనం, ఆగస్టు 12: మండల కేంద్రంలోని నెలకొన్న భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు శేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం భద్రకాళీ సమేత వీరభద్రులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం నిత్యపూజా కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. భద్రకాళీ సమేత వీరభద్రస్వామి గజ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో టీటీడీ స్థానిక ఆలయ అధికారి నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

వరదయ్యపాళెం, ఆగస్టు 12: మండలంలోని గోవర్ధనపురం వంతెన, కడూరు వంతెన సమీపంలో రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను గుర్తించిన సత్యవేడు సీఐ మురళి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వరదయ్యపాళెం పోలీసులకు సూచించారు. దీంతో సోమవారం ఏఎస్ఐ షణ్ముగం, హెడ్‌కానిస్టేబుల్ సాయిబాబా, సిబ్బంది ఆధ్వర్యంలో గుంతలను పూడ్చించారు.

పని సర్దుబాటు ప్రక్రియ బహిష్కరణ

కేవీబీపురం, ఆగస్టు 12: ఫ్యాప్టో పిలుపు మేరకు మండల విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం పని సర్దుబాటు ప్రక్రియను బహిష్కరించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. క్షేత్రస్థాయి ఇబ్బందులను పట్టించుకోకుండా ఏకపక్షంగా నిర్వహిస్తున్న పని ప్రక్రియ సర్దుబాటును నిలుపుదల చేయాలని ఉపాధ్యాయులు కోరారు. అనంతరం ఎంఈవో లక్ష్మీపతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగూరు, మోహన్‌బాబు, బాలాజీ, హేమంబరధరరావు, మధు, మురళీరెడ్డి, శారద, పద్మ పాల్గొన్నారు.

గంగమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి

రేణిగుంట, ఆగస్టు 12: రేణిగుంట గంగమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే జాతరను సోమవారం సంప్రదాయం ప్రకారం గెరిగెతో ఊరేగింపుతో ప్రారంభించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సోమవారం రాత్రి పట్టణంలో ఏర్పాటు చేసిన దేవతా మూర్తుల విద్యుత్ కటౌట్లతో జాతర కళ ఉట్టిపడుతోంది.


గెరిగె ఊరేగింపు

పంచాయతీ సమావేశాలను విధిగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో త్రివిక్రమరావు

సత్యవేడు, ఆగస్టు 12: పంచాయతీరాజ్ చట్టం మేరకు సర్పంచులు, కార్యదర్శులు విధిగా మూడు నెలకొకసారి పంచాయతీ సమావేశాలను నిర్వహించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని సర్పంచులు, కార్యదర్శులకు పంచాయతీ విధులు, బాధ్యతలు తదితర అంశాలపై శిక్షణ తరగతులను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీడీవో మాట్లాడుతూ నెలకొకసారి పంచాయతీ సమావేశాలను నిర్వహించి తీర్మానాలను ప్రవేశపెట్టాలన్నారు. లేదంటే కనీసం మూడు నెలకొక సారైనా తప్పనిసరిగా పంచాయతీ సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. ప్రధానంగా ఇంటి పన్నులను నూరుశాతం వసూలు చేసే బాధ్యత ఆయా కార్యదర్శులపై ఉంటుందన్నారు. పంచాయతీకి ఆదాయం పెరిగితే అభివృద్ధికి ఢోకా ఉండదని, అందుకు తగ్గట్లుగా సర్పంచులు, కార్యదర్శులు ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్లు శైలేంద్ర, గోవిందస్వామి, సెక్రటరీలు, సర్పంచులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో త్రివిక్రమరావు ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ విధులు, బాధ్యతలు, పారిశుధ్యం, ఘనవ్యర్థాల నిర్వాహణ, చెత్త సేకరణ, వర్మీ కంపోస్టు తయారీ, పంచాయతీ అభివృద్ధికి సంబంధించి ప్రణాళిక, ఆర్థిక వనరుల సమీకరణ తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్త సేకరణ, పొడి చెత్త వేరుచేయుట, వర్మీకం పోస్టు తయారీ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, కోర్సు డైరెక్టర్ భాస్కర్, అసిస్టెంట్ డైరెక్టర్ శివకుమార్, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ చిరంజీవి, ట్రైనింగ్ అబ్జర్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.

సీడ్‌పేపర్ జెండాల ఆవిష్కరణ


జెండాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం, ఆగస్టు 12: సీడ్ పేపర్ ప్లాంటబుల్ జెండాలను సోమవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆవిష్కరించారు. వీటిని అంబూరు పంచాయతీకి చెందిన ఎన్ఆర్ఐ నందకిషోర్‌రెడ్డి పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీడ్ పేపర్ ప్లాంటబుల్ జెండాలను పంపిణీ చేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకోవడం ఆలోచనాత్మక నిర్ణయమన్నారు. నందకిషోర్‌రెడ్డి మాట్లాడుతూ జైపూర్‌లోని సంగనేర్‌కు చెందిన నైపుణ్యం కలిగిన కళాకారులచే ఈ వినూత్న జెండాలు వ్యర్థ పత్తితో రూపొందించినట్లు తెలిపారు. వీటిలో బంతిపువ్వు గింజలు, తులసి, పండ్ల మొక్కలు ఉంటాయన్నారు. పర్యావరణాన్ని కాపాడాలనే సంకల్పంతో మొదటి ప్రయత్నంగా మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

భూసమస్యలను పరిష్కరించండి


తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 12: శ్రీకాళహస్తి మండలంలో నెలకొన్న భూసమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు తహసీల్దారు లక్ష్మీనారాయణను కోరారు. సోమవారం వారు తహసీల్దారును కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి మించల శివకుమార్ మాట్లాడుతూ మండలంలో వాగివేడు, ముచ్చివోలు, బీవీపురం, కేపీమిట్ట, సుబ్బానాయుడు కండ్రిగ గ్రామాల్లో ప్రజలు ఇంటి స్థలాల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాగివేడు సర్వే నెంబరు 1/2లో సుమారు 60 ఎకరాలు భూములను 50 కుటుంబాల దళితులు సాగు చేసుకుంటున్నారని, వారికి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. రామాపురం రెవెన్యూలో తొండమనాడు, ఎగువవీధి, అమ్మపాళెం, పుల్లారెడ్డి గ్రామాల వారికి పట్టాలు మంజూరు చేశారని, ఆ భూములను సర్వే చేసి హద్దులు చూపించాలన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌బాబు, చిన్నయ్య, శ్రీధర్, వినాయక, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

శ్రీకాళహస్తి, ఆగస్టు 12: మండలంలోని ముచ్చివోలు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంత వరకు ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమై సమస్యలపై చర్చించకపోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వం జీవో నెంబరు 117తో 128 పాఠశాలలను విలీనం చేసి విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి అదే జీవోలతో కూటమి ప్రభుత్వం వర్క్ అడ్జస్ట్‌మెంట్ చూపి ఉపాధ్యాయులను మిగులుగా చూపించడం కలిగిస్తోందని అన్నారు. తక్షణమే 117 జీవోను రద్దు చేసి, విలీనం చేసిన తరగతులను ప్రాథమిక పాఠశాలలకు అప్పగించాలన్నారు. అలాగే తొట్టంబేడు మండలంలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు రవికుమార్, శ్రీనివాసులు, విజయకుమార్, విజయ, హేమలత, ఎస్టీయూ నేతలు కృష్ణయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావేదిక వినతులను సకాలంలో పరిష్కరించండి

బుచ్చినాయుడు కండ్రిగ, ఆగస్టు 12: గ్రీవెన్స్ డేలో వచ్చిన వినతులను విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ ఆధ్వర్యంలో ప్రజావేదిక నిర్వహించారు. అనంతరం వీఆర్వోలు, సర్వేయర్లతో మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన వినతులను సకాలంలో పరిష్కరించాలన్నారు. డీటీ చంద్రబాబు, సర్వేయర్ వెంకట్రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పసుపు, కుంకుమ ఊరేగింపు

నారాయణవనం, ఆగస్టు 12: మండలంలో బుధవారం నిర్వహించనున్న ఏడు గంగమ్మల జాతరను పురస్కరించుకుని గంగమ్మ ప్రతిమ తయారీకి వినియోగించే పసుపు, కుంకమను సోమవారం ఊరేగించారు. బలిజ సంఘం ఆధ్వర్యంలో జాతరలో అమ్మవారి ప్రతిమకు కావాల్సిన పసుపు, కుంకమలను నారాయణవనం వీధుల్లో ఊరేగించారు. మహిళలు కర్పూ నీరాజనాలతో హారుతులు ఇచ్చారు. మంగళవారం పేరంటాల గెరిక ఊరేగింపు, సాయంత్రం అమ్మవారు సర్వభూపాల వాహనంపై ఊరేగింపు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.